ప్రతిపక్షం
www.prathipaksham.in

పంజాబ్‌ను గెలిపించిన కూపర్ 8

బుధవారం 01.04.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 12 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

ఇస్ఫహాన్‌లో భారీ పేలుళ్లు

- ఇరాన్ ఆయుధ డిపో పేల్చివేత
- డీశాలినేషన్ ప్లాంట్‌పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడి
- మైక్రోసాఫ్ట్, గూగుల్ సహా 18 కంపెనీలపై దాడులు: యూఎస్‌ను హెచ్చరించిన ఇరాన్
- యుద్ధం ఖర్చులు గల్ఫ్ దేశాలు భరించాలి
- మీ చమురుపాట్లు మీరే పడండి : ట్రంప్
- ఇక అధికారికంగా హొర్ముజ్ టోల్
- ఇరాన్ పార్లమెంటరీ భద్రతా కమిటీ ఆమోదం

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్

ఇరాన్‌లోని కీలక అణు కేంద్రమైన ఇస్ఫహాన్‌లోని ఆయుధ డిపోను లక్ష్యంగా చేసుకుని అమెరికాఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడితో పట్టణంలో భారీ పేలుళ్లు సంభవించాయి. 900 కిలోల ముందుగుండుతో ప్రయోగించిన బంకర్ బస్టర్ బాంబులు లోతైన భూగర్భంలో ఉన్న అణు ఆయుధ డిపోను లక్ష్యంగా చేసుకుని పేలుడు సృష్టించాయని అమెరికన్ అధికారి ఒకరు పేర్కొన్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ఈ దాడి అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం తెల్లవారుజామున ఇస్ఫహాన్‌లోని ఆయుధ డిపోపై జరిగిన దాడి దృశ్యాల వీడియోను తన ట్రూత్ సోషల్‌లో షేర్ చేశారు. వరుస పేలుళ్లు, భారీగా మంటలు ఎగసిపడుతున్న దృశ్యాలు

...:: మిగతా 2లో

"మూసీ పునరావాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని అధికారులు ముందుకు వెళ్లాలి. డిప్యూటీ సీఎం సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలి, మీ జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న మూసీ సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారు.

- అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రజాస్వామ్య పద్ధతిలో 'మూసీ' పునర్జీవనం

- 15 రోజులపాటు ప్రజల అభిప్రాయాల నమోదు
- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
- అధికారులకు 24/7 అందుబాటులో మూసీ సబ్ కమిటీ సభ్యులు
- మూసి ఫేస్ -1, ఫేస్- 2 రోడ్ మ్యాప్ ను అధికారులు సిద్ధం చేసుకోవాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 31: మూసీ పునర్జీవన పనులు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతాయని డిప్యూటీ సీఎం, మూసీ కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి, మూసి కేబినెట్ సబ్ కమిటీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ తో కలిసి మూసి పునర్జీవన పనుల ప్రగతిపై అధికారులతో చర్చించారు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ఆన్ లైన్లో మూసీ పునర్జీవనంపై ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్ లైన్లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటిని అధికారులతో కూర్చొని విశ్లేషణ చేసి అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. మూసీ నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు మార్చి 28న శంకుస్థాపన జరిగిందని, ఆ రోజు నుంచి మూసి ఫేస్ 1, ఫేస్ 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను

...:: మిగతా 2లో

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని

అప్పుల ఊబిలోకి నెట్టేసింది

- రోజువారీ ఖర్చుల కోసం ఆర్బీఐ దగ్గర చేయి చాచాల్సిన దుస్థితి
- కాగ్ నివేదికతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం బట్టబయలు
- ఇంతటి ఆర్థిక సంక్షోభంలో కూడా మిగులు బడ్జెట్ అని చెప్పకోవటం ప్రజలను మోసగించటమే
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి, 31: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రోజువారీ ఖర్చులకు ఆర్బీఐ దగ్గర చేయి చాచాల్సిన దుస్థితిలోకి రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టేసిందన్నారు. కాగ్ 2024-25 నివేదికలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వెల్లడించిన అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు "సంపద పెంచుతాం.. పేదలకు పంచుతాం" అని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ ఖర్చులకు కూడా కూడా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద చేయి చాచాల్సిన పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. 2024 25 ఆర్థిక సంవత్సరంలో రెండు రోజులు మినహా మిగతా అన్ని రోజులు ఆర్బీఐ నుంచి చేబదులుగా డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని నెట్టుకురావడం సిగ్గుచేటని అన్నారు. ఏడాది కాలంలో రూ.1.30 లక్షల కోట్లు చేబదులు అప్పులు తెచ్చి సర్కారును నడిపించటమంటే కచ్చితంగా అది చేతకాని తనమేనని విమర్శించారు. తెచ్చిన అప్పుల్లో మరో 6 వేల కోట్లు ఆర్థిక సంవత్సరం ముగిసినా చెల్లించలేదనే విషయాన్ని కాగ్ బట్టబయలు చేసిందన్నారు. నెలకు రూ. 12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్న తెలంగాణలో రోజువారీ కనీస అవసరాల కోసం రూ. 1.38 కోట్ల బ్యాలెన్స్

...:: మిగతా 2లో

4న విచారణకు రండి

- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు
- ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వేధిస్తోంది
- ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే నోటీసులు
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

మార్చి 31: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు ఇచ్చింది. కౌశిక్ రెడ్డితో పాటు

...:: మిగతా 2లో

తూతూ మంత్రంగా అసెంబ్లీ

- ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం
- బడ్జెట్, బిల్లులు పాస్ చేసుకోవడానికే సభను నడిపారు
- ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదు
- ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా సీఎం అనుచిత భాష
- మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 31: అసెంబ్లీ సమావేశాలను ప్రభుత్వం తూతూ మంత్రంగా నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చకు దూరంగా పారిపోయిందని, ఆరు గ్యారెంటీల అమలుపై స్పష్టత ఇవ్వడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ

...:: మిగతా 2లో

మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' కిరీటం

- 290 కోట్ల ఉచిత ప్రయాణాలు .. 10 వేల కోట్ల ఆర్థిక ఆదా
- అభినందన సభలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, సీతక్క
- ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట: భట్టి
- ఆర్టీసీని కాపాడుకుంటూనే సంక్షేమ పథకాల అమలు: మంత్రి పొన్నం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం: మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 31: రాష్ట్రంలో మహిళా సాధికారత దిశగా ఇందిరమ్మ ప్రభుత్వం వేసిన అడుగులు అద్భుత ఫలితాలను ఇస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు సుమారు 290 కోట్ల సార్లు ప్రయాణించి, తద్వారా 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలను ఆదా చేసుకున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో మంత్రులు మాట్లాడారు.

మహిళా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించాం. మహిళలు ఆదా చేసుకున్న ఈ రూ. 10 వేల కోట్లు వారి కుటుంబ ఆర్థిక అవసరాలకు, పిల్లల చదువులకు ఉపయోగపడతాయి. కేవలం బస్సు ప్రయాణమే కాకుండా, మహిళలను లక్షాధికారులను చేయడమే మా లక్ష్యం. రాబోయే 3 ఏళ్లలో మహిళా సంఘాలకు

...:: మిగతా 2లో

రేపటి నుంచి గ్రామసభలు నిర్వహించాలి

- జూన్ 2 నుంచి అమలు చేయబోయే పథకాల గురించి వివరించాలి
- రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం
- 'ప్రజా పాలన -ప్రజా ప్రణాళిక'పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 31: ప్రజా పాలన ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా

...:: మిగతా 2లో

ఎల్ డీఎఫ్ గెలవాలని మోడీ కోరిక

కేరళలోని కన్నూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ, బీజేపీకి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కి మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. ఆ రెండింటితో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ పోరాడుతోందని వెల్లడించారు.

7

అసోంలో ఎన్నికల మేనిఫెస్టో రిలీజ్

అసోంలో ఏప్రిల్ 9న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ ప్రకటించింది. బంగ్లాదేశీయులను రాష్ట్రం నుంచి పంపించడంతోపాటు యూసీసీ చట్టంపై కూడా ప్రజలకు హామీ ఇచ్చింది.

7

టీవీకే చీఫ్ విజయ్‌పై కేసు

తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ చీఫ్ విజయ్‌కు ఎన్నికల సంఘం షాకిచ్చింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు విజయ్‌పై ఈసీ కేసు నమోదు చేసింది. పెరావల్లూర్ పోలీస్ స్టేషన్‌లో విజయ్‌పై కేసు నమోదైంది.

7

భారీ ఉగ్రకుట్ర భగ్నం

దేశంలో భారీ ఉగ్రకుట్ర బయటపడింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు సహకరిస్తున్న షబ్బీర్ అహ్మద్ అనే ఉగ్రవాదిని ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు.

7

ప్రజాస్వామ్య పద్ధతిలో 'మూసీ' పునర్జీవనం

మొదటిపేజీ తరువాయి

ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసీ పునరావాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, యావత్ కేబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలని, మీ జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్న మూసీ సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ రంజన్, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి. ఇవి. నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి , అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మన చౌదరి, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు 'మహాలక్ష్మి' కిరీటం

మొదటిపేజీ తరువాయి

రూ. లక్ష కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలు అందించబోతున్నాం. మహిళలు సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది," అని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్మికులంతా మా కుటుంబ సభ్యులే

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "మహాలక్ష్మి పథకం విజయవంతం కావడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర మరువలేనిది. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులలో 40 లక్షల మంది మహిళలే ఉండటం గొప్ప విషయం. ఆర్టీసీని కాపాడుకుంటూనే మహిళలకు ఈ సదుపాయం కల్పిస్తున్నాం. ఇప్పటికే ఆర్టీసీకి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తోంది. కొత్త బస్సులు, కొత్త రూట్ల ఏర్పాటుతో సంస్థను మరింత బలోపేతం చేస్తాం," అని హామీ ఇచ్చారు.

రాజకీయ విమర్శలకు మహిళలే సమాధానం చెప్పాలి

మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఉచిత ప్రయాణాన్ని విమర్శించే వారికి మహిళలు తమ తిరుగుబాటు ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు వారికి అప్పగిస్తున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించేది లేదు," అని ధీమా వ్యక్తం చేశారు. అనంతర మహిళలు పొదుపు చేసుకున్న రూ. 10,000 కోట్ల మెగా చెక్కును మంత్రులు ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్, మాజీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, సెర్ఫ్ సీఈవో దివ్య, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఆర్టీసీ ఈడీలు సిహెచ్.వెంకన్న, ఖుస్రో షా ఖాన్ , రాజశేఖర్ పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వేలాది మంది మహిళలు పాల్గొని ఉత్సాహంగా ఈ వేడుకను జరుపుకున్నారు.

రేపటి నుంచి గ్రామసభలు నిర్వహించాలి

మొదటిపేజీ తరువాయి

లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

తూతూ మంత్రంగా అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి

సమావేశాల నిర్వహణపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శాసనసభ సమావేశాలు ఎలాంటి దిశానిర్దేశం లేకుండా తూతూ మంత్రంగా ముగిశాయని, రాష్ట్ర ప్రజలు ఆరు గ్యారెంటీలపై స్పష్టత వస్తుందని ఆశించినా ప్రభుత్వం తీవ్ర నిరాశ కలిగించిందని ఆయన అన్నారు. బడ్జెట్ , బిల్లులు పాస్ చేసుకోవడం వంటి రాజ్యాంగపరమైన అవసరాల కోసమే సభను నడిపారని, కానీ ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు. ప్రజలు ఎదుర్కొంటున్న 19 ముఖ్య సమస్యలపై షార్ట్ డిస్కషన్ కోసం బీఆర్ఎస్ నోటీసులు ఇచ్చినా, ప్రభుత్వం ఒక్క అంశాన్నీ చర్చకు అనుమతించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెప్పుకునేలా ఒక్క ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ కూడా లేదని, సభా సాంప్రదాయాలు, నియమ నిబంధనలు పూర్తిగా విస్మరించబడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా అనుచిత భాష వాడారని, ఆయన ప్రవర్తన సభానాయకుడి హోదాకు తగినది కాదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఎప్పుడైనా డిఫెన్స్‌లో పడితే ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయడం, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం తప్ప మరేదీ చేయడం లేదని ఆయన అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నించడం ప్రతిపక్ష బాధ్యత అని, ఆ బాధ్యతను బీఆర్ఎస్ నిర్వర్తిస్తుండగా కాంగ్రెస్ తట్టుకోలేకపోతుందని విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా ఎత్తివేసి ప్రతిపక్షాల ప్రశ్నలను అడ్డుకున్నారని, అనేక రోజుల పాటు సభ సమయానికి ప్రారంభం కాలేదని తెలిపారు. సభ నిర్వహణలో సమయపాలన లేకుండా వ్యవహరించారని, టీ బ్రేక్ పేరుతో గంటల తరబడి సభను నిలిపివేసిన ఘటనలను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి వస్తున్నారనే కారణంతో నాలుగు గంటల టీ బ్రేక్ ఇవ్వడం, ఆర్థిక మంత్రి సిద్ధం కావాలనే కారణంతో మూడు గంటలు సభను ఆపడం వంటి ఘటనలు సభ గౌరవాన్ని తగ్గించాయని విమర్శించారు. కావాలనే రాత్రి ఆలస్యంగా సభ నడిపి సభ్యుల హాజరు తగ్గించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కేరళ ఎన్నికల ప్రచారం కోసం అసెంబ్లీని ముందుగానే ముగించారని, తెలంగాణ ప్రజల కంటే కాంగ్రెస్‌కు ఇతర రాష్ట్రాల ఎన్నికలు ముఖ్యమా అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని ఆధారాలతో బయటపెడితే దృష్టి మరల్చేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసి, ప్రతిపక్షం లేకుండా బిల్లులు ఆమోదించారని అన్నారు. హేట్ స్పీచ్ బిల్లును చర్చ లేకుండా చివరి రోజు ఆమోదించారని, పద్దులను గిలెటిన్ చేసి పారిపోయారని విమర్శించారు. బడ్జెట్ పై మాట్లాడుతూ, ఇది పూర్తిగా డొల్ల బడ్జెట్ అని, అందుకే నిరసనగా చింపాల్సి వచ్చిందని తెలిపారు. ఇది వ్యక్తిగత విమర్శ కాదని, ప్రభుత్వ విధానాలపై విమర్శ అని స్పష్టం చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మూడు బడ్జెట్లు పెట్టినా అమలు చేయలేదని, మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీకి నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, మహిళలు సహా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు ముఖ్యమంత్రి ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించిన ఆయన, ఉద్యోగాల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని, కేవలం 16 వేల ఉద్యోగాలే ఇచ్చినట్టు అధికారికంగా వెల్లడైందని అన్నారు. బీసీ కార్పొరేషన్‌కు రెండున్నర సంవత్సరాల్లో ఒక్క పైసా ఖర్చు చేయలేదని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సభలో కాంగ్రెస్ సభ్యులు అనుచిత భాష వాడుతున్నారని, ఆ వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి బీఆర్ఎస్‌పై బురదజల్లుతున్నాయని, ఇది రెండు పార్టీల మధ్య ఉన్న స్నేహాన్ని చూపిస్తోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికి ఆదర్శమని కేంద్ర మంత్రులు, అధికారులు చెప్పిన విషయాలను గుర్తుచేసిన ఆయన, ఈ ప్రాజెక్టు వల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని 'ఎకనామిక్ సర్వే'లో కూడా పేర్కొన్నారని తెలిపారు.

పశ్చిమాసియాలో యుద్ధంతో ప్రపంచమంతా ఇబ్బందిపడుతుంటే భారత్ సమర్థంగా వ్యవహరించింది. అయితే కాంగ్రెస్ ప్రజలను రెచ్చగొట్టడంలో బిజీగా ఉంది. పరిస్థితులను వాడుకొని లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ 'రాజకీయ రాబందు'లా ఎదురుచూస్తోంది. పెట్రోల్ బంకుల వద్ద క్యూ కట్టించి కల్లోలం సృష్టించే యత్నం చేస్తోంది.

- ప్రధాని నరేంద్ర మోడీ

సామాజిక న్యాయం కోసం జ్యోతిబా పూలే పోరాటం

- మహిళలు చదువుకోవడం కోసం ఉద్యమించిన పూలే
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఆశీర్వాదంతో ప్రజా పాలన ప్రభుత్వం
- బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- పూలే విగ్రహ పనులను పరిశీలించిన మంత్రులు పొన్నం, కొండా సురేఖ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 31: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ల ఆశీర్వాదంతో ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిందని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రగతి భవన్ ను మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్గా మార్చుకున్నామని, జ్యోతిబా పూలే సామాజిక న్యాయం కోసం ఎన్నో పోరాటాలు చేశారని, సావిత్రి బాయి పూలే మహిళలు చదువుకోవడం కోసం ఉద్యమించారని అన్నారు. ఇక్కడ దాదాపు 4 కోట్లతో మహాత్మాజ్యోతిబాపులే, సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని, ట్యాంక్ బండ్ ఐమాక్స్ థియేటర్ ఎదురుగా లేక్ వ్యూ పార్క్ వద్ద ఏప్రిల్ 11న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదిగా ప్రారంభించుకునే మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహ నిర్మాణ పురోగతి పనులను మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్ , ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్ , బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కవ్వంపల్లి సత్యనారాయణ, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్ , ముఠా గోపాల్ , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , మాజీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్ లు, నూతి శ్రీకాంత్ గౌడ్ ,మెట్టు సాయి కుమార్, జెరిపాటి జైపాల్ , బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్ ,దాసు ,బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమయాదేవి, హైదరాబాద్ కలెక్టర్, జీహెచ్ ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించి 11న పూలే విగ్రహావిష్కరణ ప్రారంభం పై ఏర్పాట్లు సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల ముందే విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభ ప్రాంగణం లో ఎవరికి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 11న సాయంత్రం ముఖ్యమంత్రి చేత ఈ పూలే విగ్రహాన్ని ప్రారంభించుకుంటున్నామని తెలిపారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ జిల్లా అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. 11న ఉదయం గ్రామాల్లో జ్యోతి బాపూలే కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని సాయంత్రం సభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జ్యోతి బాపులే సావిత్రి బాయి పూలే విగ్రహాలకు ఒక పక్కన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, మరో పక్కన మహనీయుడు బీఆర్ అంబేద్కర్, ఇటువైపు ఆర్థిక సంస్కరణల నిపుణులు పీవీ నరసింహారావు విగ్రహాలు ఉన్నాయని, మహనీయులు ఉన్న ఈ ప్రాంతం నేటితరానికి వారి జీవిత చరిత్ర తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ మార్గానికి పూలే మార్గ్ గా పేరు పెట్టాలని స్థానిక శాసన సభ్యులు దానం నాగేందర్ సూచించారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని తెలిపారు.

ఇస్ఫహాన్‌లో భారీ పేలుళ్లు

మొదటిపేజీ తరువాయి

అందులో కనిపించాయి. ఈ వీడియోకు సంబంధించిన వివరాలేవీ ట్రంప్ వెల్లడించనప్పటికీ 23 లక్షల మంది జనాభా గల ఇస్ఫహాన్ పట్టణంలోని ఆయుధాల డిపోపై అమెరికాఇజ్రాయెలీ దళాలు దాడులు జరిపినట్లు మీడియా కథనాలు తెలిపాయి. కాగా, హోర్ముజ్ జలసంధిలోని ఇరాన్‌కు చెందిన ఖేష్మ్ దీవిలోని ఉప్పు నీటి శుద్ధీకరణ ప్లాంటు(డీశాలినేషన్)పై మంగళవారం వైమానిక దాడి జరిగినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. ఈ దాడి కారణంగా ప్లాంటు పూర్తిగా పనికిరాకుండా పోయినట్లు మీడియా పేర్కొన్నది. ఈ నీటి శుద్ధి ప్లాంటు పూర్తిగా పనిచేయడం లేదని, ఇప్పట్లో దీన్ని మరమ్మతు చేయడం కూడా సాధ్యం కాదని ఇస్నా వార్తా సంస్థ తెలిపింది. కాగా, డీశాలినేషన్ సదుపాయంపై దాడులు చేయడం పశ్చిమాసియా వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు రేకెత్తించింది. ప్రపంచంలోనే అత్యధిక ఎడారి ప్రాంతమైన గల్ఫ్‌లోని ప్రజల దాహార్తిని ఈ డీశాలినేషన ప్లాంట్లే తీరుస్తున్నాయి. యూఏఈలో 42%, సౌదీలో 70%, ఒమన్‌లో 86%, కువైట్‌లో 90% ప్రజలు మంచినీటి కోసం డీశాలినేషన్ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నట్లు 2022నాటి ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ పేర్కొన్నది. ఇరాన్‌పై దాడులు ఉధృతం చేస్తామని సోమవారం హెచ్చరించిన ట్రంప్ చమురు, విద్యుచ్ఛక్తి సదుపాయాలతోపాటు డీశాలినేషన్ ప్లాంట్లను కూడా ధ్వంసం చేస్తామని హెచ్చరించిన మరుసటిరోజే ఖేష్మ్ దీవిలోని డీశాలినేషన్ ప్లాంటుపై దాడి జరగడం గమనార్హం.

అమెరికన్ టెక్ కంపెనీలే టార్గెట్

ఇరాన్ భూభాగంపై జరిగిన దాడులకు ప్రతీకారంగా అమెరికాకు చెందిన టెక్నాలజీ, పారిశ్రామిక కంపెనీలపై ఏప్రిల్ 1 నుంచి దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, ఇంటెల్, ఐబీఎం, టెస్లా, బోయింగ్ సహా 18 కంపెనీల పేర్లను ఐఆర్‌జీసీ పేర్కొంటూ ఈ కంపెనీల ప్రాంతీయ కార్యకలాపాలను స్తంభింపచేస్తామని హెచ్చరించింది. ఇరాన్‌లో జరిగిన ప్రతి ఉగ్ర చర్యకూ సంబంధిత కంపెనీల యూనిట్లు విధ్వంసాన్ని ఎదుర్కోవలసిందేనని తెలిపింది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి(టెహ్రాన్ కాలమానం) దాడులు ప్రారంభమవుతాయని ఐఆర్‌జీసీ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. భారత్ కన్నా రెండు గంటలు ఆలస్యంగా ఉన్న టెహ్రాన్‌లో రాత్రి 8 గంటలంటే భారత్‌లో అది రాత్రి 10 గంటల సమయం. ఇకపై లక్ష్యాలను రూపొందించడంలో, వేటాడటంలో ప్రధాన అంశం అమెరికన్, ఐసీటీ, ఏఐ కంపెనీలే కాబట్టి ఈ ప్రధాన సంస్థలే మన చట్టబద్ధమైన లక్ష్యాలు అవుతాయి అని తస్నీం న్యూస్ ద్వారా వెలువడిన ప్రకటనలో ఐఆర్‌జీసీ పేర్కొన్నది. తమ భద్రతను దృష్టిలో పెట్టుకుని వెంటనే తమ కార్యాలయాలను వీడి వెళ్లిపోవాలని ఈ సంస్థల ఉద్యోగులను కూడా ఐఆర్‌జీసీ హెచ్చరించింది. మరోవైపు, గల్ఫ్, ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులను కొనసాగించింది.

మీ చమురుపాట్లు మీరే పడండి : ట్రంప్

పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇంధన కొరతనుఎదుర్కొంటున్న దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు ప్రత్యామ్నాయాలు సూచించారు. అమెరికా నుంచి చమురు కొనండి లేదా ఇరాన్ అడ్డగించిన హోర్ముజ్ జలసంధి ద్వారా చమురు సరఫరాలు సాధించుకోండి అంటూ మంగళవారం యుద్ధ ప్రభావిత దేశాలకు ట్రంప్ పిలుపునిచ్చారు. యుద్ధంలో చేరాలంటూ తాను ఇచ్చిన పిలుపును తిరస్కరించిన మిత్రదేశాలపై ట్రంప్ మండిపడ్డారు. దేశాలు తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలి. మిమ్మల్ని కాపాడేందుకు అమెరికా అక్కడ ఎప్పుడూ ఉండదు. ఇరాన్ దాదాపుగా నాశనమైంది. ఒక కష్టమైన పని పూర్తయింది. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

హోర్ముజ్ తెరువకపోయినా..యుద్ధానికి బ్రేక్

ఇరాన్‌తో యుద్ధం ఐదో వారానికి చేరుకోవడం.. ఈ సంక్షోభం అంతమయ్యే సూచనలు కన్పించకపోవడంతో ఎలాగైనా యుద్ధాన్ని ముగించేద్దాం అని ట్రంప్ యోచిస్తున్నారు. తాము ప్రారంభించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి తెరదించాలని తాను భావిస్తున్నానని ఆయన తన సన్నిహితుల వద్ద పేర్కొన్నారని, ప్రస్తుతం ప్రధాన సమస్యగా ఉన్న హోర్ముజ్ జలసంధి మూసివేత కొనసాగుతున్నా.. ఆ సమస్యను పక్కన పెట్టి యుద్ధాన్ని ముగించాలని భావిస్తున్నారని ఉన్నతాధికారులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది.

ఇక అధికారికంగా హోర్ముజ్ టోల్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిపై మరింత పట్టు సాధించేందుకు ఒక కొత్త నిర్వహణ ప్రణాళికను ఇరాన్ పార్లమెంటరీ భద్రతా కమిటీ ఆమోదించింది. ఈ ఇంధన మార్గం గుండా వెళ్లే నౌకలపై సుంకాలు విధించడం, అలాగే అమెరికా, ఇజ్రాయెల్ నౌకలను ఈ జలమార్గం గుండా వెళ్లకుండా నిషేధించడం వంటి చర్యలు ఈ ప్రణాళికలో ఉన్నాయని వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది.

యుద్ధ ముగింపునకు 5 అంశాల ప్రణాళిక.. చైనా, పాక్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను చల్లార్చడానికి చైనా, పాకిస్థాన్ సంయుక్తంగా ఓ ఐదు అంశాల ప్రణాళికను ప్రతిపాదించాయి. తక్షణమే ఘర్షణలను నిలిపివేయడం, శాంతి చర్చలను త్వరగా ప్రారంభించడం, పౌర, సైనికేతర మౌలిక సదుపాయాలకు రక్షణ కల్పించడం, హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన మార్గాలను సురక్షితం చేయడం, ఐక్యరాజ్యసమితి చార్టర్ కింద ఒక సమగ్ర శాంతి చట్రాన్ని నిర్మించడం వంటివి చైనా, పాక్ ప్రతిపాదించిన ప్రణాళికలోని అంశాలు.

'దమ్ముంటే దగ్గరకు రండి... మీ కోసమే ఎదురుచూస్తున్నాం'

భూతల యుద్ధానికి సిద్ధమైన అమెరికా.. మీ కోసమే ఎదురుచూస్తున్నాం.. దమ్ముంటే రావాలంటూ ఇరాన్ సవాల్ ఇరాన్‌పై దాడుల్ని ఇంకా తీవ్రం చేసేందుకు పశ్చిమాసియాలో అమెరికా భారీ దళాల్ని మోహరిస్తోంది. యూఎస్ఎస్ ట్రిపోలి నౌకలో 3,500 ట్రూపుల్ని రంగంలోకి దించింది. ముఖ్యంగా ఇరాన్ సమీప దీవుల్లోపాటు, ఇరాన్‌పై అవసరమైతే భూతల దాడులు చేయాలని అమెరికా భావిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికాకు ఇరాన్ హెచ్చరిక జారీ చేసింది. ఈ మేరకు ఇరాన్ అధికారిక మీడియా ఒక వీడియో విడుదల చేసింది. ఇందులో ఇరాన్ ఎలైట్ కమాండోస్ యుద్ధ సన్నాహాల్లో ఉన్నారు. ఆయుధాలు ప్రయోగించడం, శత్రువుల్ని ఎదుర్కోవడం వంటి వాటికి సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా 'దమ్ముంటే దగ్గరకు రండి. మేం మీ కోసమే ఎదురుచూస్తున్నాం' అంటూ సందేశాన్ని అమెరికా సైన్యానికి పంపింది.

4న విచారణకు రండి

మొదటిపేజీ తరువాయి

మరో 20 మందికి సీఐడీ అధికారులు నోటీసులు అందజేశారు. ఏప్రిల్ 4న హైదరాబాద్‌లో విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. జనవరి 29న సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా హుజురాబాద్‌లో కౌశిక్ రెడ్డి హంగామా చేసిన విషయం తెలిసిందే. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో కౌశిక్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హుజురాబాద్‌లో నమోదైన కేసును ప్రభుత్వం సీఐడీకి బదిలీ చేసింది. ఈ కేసుపై సీఐడీ అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు నోటీసులు ఇచ్చిన సీఐడీ, ఏప్రిల్ 4న హైదరాబాద్ లక్డీకాపూల్‌లో ఉన్న సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సిందిగా స్పష్టంగా పేర్కొంది. సమ్మక్కసాలరమ్మ జాతర సందర్భంగా కౌశిక్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు కూడా ఆందోళన చేశారు. దీంతో వారందరినీ హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నోటీసులు ఇచ్చారు సీఐడీ అధికారులు. దాదాపు 20 మందికి నోటీసులు అందజేశారు. సీఐడీ నోటీసులపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా వేధిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే సీఐడీ నోటీసులు జారీ చేసిందని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు..

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని

అప్పుల ఊబిలోకి నెట్టేసింది

మొదటిపేజీ తరువాయి

కూడా మెయింటెన్ చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు.

సంపద పెంచటంలో విఫలం

ఎన్నికలకు ముందు సంపద పెంచుతాం.. పేదలకు పంచుతామని కాంగ్రెస్‌నాయకులు పెద్ద, పెద్ద మాటలు చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద పెంచటం మాట అటుంచితే కేవలం అప్పులతోనే కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఇప్పటికే అడ్డగోలుగా రూ. 8.65 లక్షల కోట్ల అప్పులు చేసి, రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై దాదాపు రూ. 9 లక్షల అప్పు భారాన్ని మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి ఆర్థిక సంక్షోభంలో కూడా ఇంకా "మిగులు బడ్జెట్" అని చెప్పుకుంటూ తెలంగాణ ప్రజలను పచ్చి దగా చేస్తున్నారంటూ మండిపడ్డారు. కాగ్ నివేదికతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక విధ్వంసం బట్ట బయలైందన్నారు. ఇకనైనా ప్రచార ఆర్భాటాలు బంద్ చేసి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అకాల వర్షా లతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అకాల వర్షాలు రైతులను ఆగం చేశాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లో అకాల వర్షాల కారణంగా చేతికొచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. వందలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, మామిడి కాయలు నేలరాలాయని తెలిపారు. నువ్వులు, పసుపు, వరి పంటలకు తీరని నష్టం జరిగిందన్నారు. అకాల వర్షాల కారణంగా రైతుల కష్టం అంతా నేల పాలైందని విచారం వ్యక్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి, మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్టీ ఏర్పాటుపై సమాలోచనలు

రాజకీయపార్టీ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో తెలంగాణ జాగృతి కేడర్తో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమాలోచనలు జరుపనున్నారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు వరుసగా ఉమ్మడి జిల్లాల వారీగా నాయకులు, కార్యకర్తలతో చర్చలు జరుపనున్నారు. పార్టీ ఏర్పాటు కోసం వివిధ వర్గాల ప్రజల సమస్యలు, వాటికి పరిష్కారాలు, తెలంగాణ రాష్ట్ర స్వయం సమృద్ధి కోసం రూపొందించాల్సిన బ్లూ ప్రింట్ పై 50 కమిటీలు ఏర్పాటు చేసి స్టడీ చేసిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పుడు కేడర్ నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. జాగృతి నాయకులు, కార్యకర్తలతో కవిత సమావేశాల షెడ్యూల్ ను మంగళవారం జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి విడుదల చేశారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు సమావేశాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఏప్రిల్ ఒకటో తేదీ, బుధవారం రోజున హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు. గురువారం ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలు, శుక్రవారం నల్గొండ మహబూబ్నగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని జాగృతి వర్గాలు తెలిపాయి.

రాష్ట్రీయం

గ్రామ సభలను విజయవంతం చేయాలి

- ప్రజల స్వరాన్ని ప్రతిబింబించే వేదికలుగా సభలు జరగాలి
- అధికారులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి సీతక్క

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 31: "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారులతో మంత్రి సీతక్క మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్యదేవరాజన్ తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యాచరణలో భాగంగా గురువారం గ్రామ సభలు నిర్వహించనున్న నేపథ్యంలో వాటి నిర్వహణపై మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామ సభలు ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునే అత్యంత ముఖ్యమైన వేదికలని మంత్రి పేర్కొన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, గ్రామ స్థాయి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు కనుగొనడం, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష చేయడం, ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించడం ద్వారా పాలనను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా మార్చవచ్చని చెప్పారు. గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, రైతులు, యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, లబ్ధిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామంలో విస్తృత ప్రచారం చేపట్టి గ్రామస్థులందరూ హాజరయ్యేలా చూడాలని చెప్పారు. సభల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వేదిక, త్రాగునీరు, మహిళలు మరియు వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఆదేశించారు. సభల అజెండాను స్పష్టంగా ప్రజలకు తెలియజేసి, ప్రభుత్వ పథకాలపై సమగ్ర చర్చ జరిగేలా చూడాలని పేర్కొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, పింఛన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి వంటి పథకాలపై గ్రామ సభల్లో విస్తృతంగా చర్చించాలన్నారు. ఈ బడ్జెట్ లో ప్రతిపాదించిన నూతన పథకాల కోసం అర్హులను గుర్తించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామ సభలో విధిగా ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేసి ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశించారు. గ్రామ సమస్యలను సమగ్రంగా గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామ సభలను పల్లెల్లో పండగలా నిర్వహించి విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

ట్యాంక్‌బండ్ శివకు ఆర్థిక సాయం

- కుమారుడికి హోంగార్డు ఉద్యోగం
- ఆర్థిక సాయం, నియామక పత్రం అందించిన సీఎం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 31: హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయంతో పాటు ట్యాంక్‌బండ్ శివ కుమారుడు వేణుమాధవ్‌కు హోం గార్డు ఉద్యోగం ఇస్తూ అందుకు సంబంధించిన నియామకపత్రాన్ని అందజేశారు. ప్రమాదవశాత్తు, లేదా ఇతరత్రా ఘటనల్లో హైదరాబాద్ హుస్సేన్ సాగర్ (ట్యాంక్ బండ్) లో పడిన ఎంతోమంది ప్రాణాలను శివ కాపాడారు. అయితే, కుటుంబ పోషణ భారమై శివ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలియడంతో ముఖ్యమంత్రి స్పందించారు. శివకు అవసరమైన సహాయం అందించాలని కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు పలు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే శివ కుటుంబం ముఖ్యమంత్రిని కలిశారు. ఉపాధి కోసం ట్యాంక్‌బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా శివ కోరడంతో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారు. సహృదయంతో స్పందించడమే కాకుండా ముఖ్యమంత్రి చేతుల మీదుగా సాయం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ట్యాంక్‌బండ్ శివ కుటుంబ సభ్యులు అన్నారు.

సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది

- బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సీఎం ప్రజావాణిలో 405 దరఖాస్తులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 31: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 211వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 405 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 160, రెవెన్యూ శాఖకు సంబంధించి 53, ఇందిరమ్మ ఇండ్ల కోసం 114, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 77 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీఎం ప్రజావాణిని సందర్శించారు. అన్ని డెస్క్‌లను పరిశీలించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రవాసి ప్రజావాణి పని తీరును కూడా పరిశీలించారు. సీఎం ప్రజావాణి అమలుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంచార్జ్ చిన్నారెడ్డితో చర్చించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సీఎం ప్రజావాణి కేంద్ర బిందువుగా నిలిచిందని, సీఎం ప్రజావాణి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్, అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏసీపీ ఉమేందర్, ఎన్ఆర్ఐ సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో జాతీయ సదస్సు

- బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 31: డా. బీఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆర్థికశాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చంచల్‌గూడ ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం: విభేదాలు, భవిష్యత్ దిశ" అనే అంశంపై నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించి బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ.ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొ.చక్రపాణి మాట్లాడుతూ, ఆర్థిక సంస్కరణలు రాజ్యాంగ పరిమితులతో సమన్వయం సాధిస్తూ సమగ్ర, సమాన అభివృద్ధిని సాధించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సు ఏప్రిల్ 9-10 తేదిల్లో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సు ద్వారా ఆర్థిక సంస్కరణలు, రాజ్యాంగ పరిమితుల మధ్య ఉన్న సంబంధాలు, సవాళ్లు, అలాగే భవిష్యత్ అవకాశాలపై లోతైన చర్చలు జరగనున్నాయని సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి. పుష్పా చక్రపాణి; సామాజిక శాస్త్రాల విభాగ డీన్ ప్రొ.పల్లవి కాబ్డే; ఆర్థికశాస్త్ర విభాగాధిపతి ప్రొ.కె. కృష్ణారెడ్డి, ఓఎస్డీ ప్రొ. రవీంద్రనాథ్ సోలమన్, ప్రొ. శ్రీదేవి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (చంచల్‌గూడ) వైస్ ప్రిన్సిపాల్, ప్రొ.జి.నాగోజి; డా.జే. మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్ రెడ్డిని పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆయన మాతృమూర్తి చంద్రకళమ్మ మృతిచెందిన నేపథ్యంలో ఆయర నివాసానికి వెళ్లి పరామర్శించిన సీఎం, ఈ సందర్భంగా చంద్రకళమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె మృతి పట్ల సానుభూతి వ్యక్తం చేశారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్

న్యాయవాదుల రక్షణ చట్టం అమలు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టీపీసీసీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు గాంధీభవన్లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు.

- ప్రతిపక్షం, హైదరాబాద్

కల్తీసారా తాగొద్దంటే బద్నాం చేస్తారా?

- 90 రోజులకు ఒకసారి సినీ తారలు డ్రగ్ టెస్ట్ చేసుకోవాలి
- నెగెటివ్ వస్తేనే షూటింగులకు అనుమతి ఇవ్వాలి
- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఫైర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 31: తనపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. కల్తీసారా తాగకండి అంటే తనని బద్నాం చేస్తారా? అంటూ తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులకు ప్రైవసీ అనేది లేకుండా పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఆదివాసీలు లిక్కర్ చేస్తే తప్పా? కార్పొరేట్ కంపెనీలు చేస్తే కరెక్టా? అంటూ ఆయన ప్రశ్నించారు. ఇప్పసారాకు 3 వేల ఏళ్ల చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇప్పసారా ఇండియన్ లిక్కర్ అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా సినీ తారలపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను డ్రగ్ టెస్ట్ చేసుకున్నానని చెప్పారు. సినీ తారలు కూడా డ్రగ్ టెస్ట్ చేసుకోవాలని ఆయన సూచించారు. సినీ తారలపైనే అధికంగా డ్రగ్ రూమర్స్ ఉన్నాయని గుర్తు చేశారు. కానీ రాజకీయ నాయకులపై డ్రగ్ రూమర్స్ తక్కువేనన్నారు. ప్రతి 90 రోజులకు ఒక సారి డ్రగ్ టెస్ట్ చేసుకోవాలంటూ సినీ తారలకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సూచించారు. డ్రగ్ టెస్ట్‌లో నెగెటివ్ వస్తేనే షూటింగ్స్‌లలో పాల్గొనేందుకు వారికి అనుమతి ఇవ్వాలని స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలలోనే డ్రగ్స్ బారిన పడిన వారు అధికంగా ఉన్నారని ప్రజలు భావిస్తున్నారన్నారు. సీఎం రేవంత్ మందు తాగడు.. సిగరెట్ ముట్టుకోడని తెలిపారు. తమ యాక్టర్ డ్రగ్ అడిక్ట్ కాదన్నారు. తాము కూడా డ్రగ్స్‌కి దూరంగా ఉండాలనుకుంటున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పసారాకు శతాబ్దాల చరిత్ర ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇటీవల వెల్లడించారు. ఈ ఇప్పసారా తాగడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. గతంలో ఈ ఇప్పసారి తాగి 110 ఏళ్లు బతికారని అనిరుధ్ రెడ్డి వివరించారు. అనిరుధ్ వ్యాఖ్యలపై ప్రజలు తమదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు.

విద్యావేత్త వాజిద్ పాషాకు గౌరవ డాక్టరేట్

ప్రతిపక్షం, హైదరాబాద్, మార్చి 31 :మ్యాగ్నెట్, శ్రీ నారాయణ విద్యాసంస్థల అధినేత, కరస్పాండెంట్ ఎండీ. వాజిద్ పాషా జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ న్యూయార్క్ ప్రతినిధులు ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. విద్యా రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రతిష్ఠాత్మక 'భారత్ గౌరవ్ రత్న శ్రీ సమ్మాన్' అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. వాజిద్ పాషా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల మ్యాగ్నెట్, శ్రీ నారాయణ విద్యాసంస్థల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ప్రజా గాయకుడు గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలా?

- బీజేపీ కేంద్ర మంత్రులలను తెలంగాణలో తిరుగనివ్వం
- ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్ హెచ్చరిక
- ఫీవర్ ఆసుపత్రి వద్ద దిష్టిబొమ్మ దగ్ధం

ప్రతిపక్షం సిటీ బ్యూరో, హైదరాబాద్, మార్చి 31: ప్రజా గాయకుడు గద్దర్ పై అనుచిత అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు చర్య అని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని, బీజేపీ కేంద్ర మంత్రులను తెలంగాణలో తిరుగనివ్వమని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్ హెచ్చరించారు. బీజేపీ నేతల అహంకారానికి ఇది పరాకాష్ట సంఘటన అని అన్నారు. మంగళవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి వద్ద దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఉద్యమకెరటం గద్దర్ను పార్లమెంటులో అవమానిస్తూ అమిత్ షా వ్యాఖ్యలు చేస్తుంటే, కేంద్ర మంత్రులు నవ్వుతూ ఉన్నారని, తెలంగాణ ఉద్యమకారులకు అవమానం జరుగుతుంటే తెలంగాణ బిడ్డలుగా స్పందించాల్సింది పోయి నవ్వుతూ ఉండడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. క్షమాపణ చెప్పని పక్షంలో తీవ్ర ఆందోళన కార్యక్రమాలతో బీజేపీ నేతలకు నిరసన సెగ చూపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అమరులను అగౌరవాన్ని చూస్తూ ఊరుకోదని, బీజేపీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మోత రోహిత్ వెల్లడించారు. బీజేపీ అవమానానికి గౌరవంగా బీజేపీ కార్యాలయానికి వెళ్లే దారికి గద్దర్ పేరు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డికి వినతి చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీలోని కార్యకర్తలు, పెద్ద ఎత్తున నేతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాలపై రాజీ లేదు

- రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం
- రైతులకు నష్టం జరిగితే ఊరుకోం
- చట్టపరమైన పోరాటానికి సిద్ధం
- మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరిక

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 31: శ్రీశైలం జలాల విషయంలో రాజీపడేది లేదని, తమకు రాష్ట్రప్రయోజనాలే ముఖ్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్లో జరిగిన మీడియా సమావేశంలో జూపల్లి కృష్ణారావు కీలక వ్యాఖ్యలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని ఆరోపించారు. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 834 అడుగులకు చేరినప్పుడు విద్యుత్ ఉత్పత్తి చేయకూడదనే నిబంధన ఉందని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ అవసరాలను పట్టించుకోకుండా అక్రమంగా నీటిని వినియోగించిందని ఆరోపించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగం, కృష్ణా పరివాహక ప్రాంత ప్రజల కోసం శ్రీశైలం వద్ద "వంటావార్పు" ఆందోళనకు పిలుపునిచ్చామని తెలిపారు. మా హెచ్చరికలతోనే ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి నిలిపిందని పేర్కొన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటిపై రాజీ లేదని, పాలమూరు రైతులకు నష్టం జరిగితే ప్రభుత్వం పోరాడుతుందని, ఇలాంటివి మళ్లీ జరిగితే చూస్తూ ఊరుకోం అని తీవ్రంగా హెచ్చరించారు. చట్టపరమైన పోరాటానికి సిద్ధం అని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వంశీ కృష్ణ, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

'మై టీడీపీ' యాప్ ద్వారా పార్టీలో కష్టపడే వారిని గుర్తిస్తాం. పనిచేసే వారిని సీఎం డైరెక్ట్‌గా గుర్తించి పదవులు ఇస్తున్నారు. ఎవరి సిఫార్సులు చెల్లవు. పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు. అందుకే పార్టీకి ఎక్కువ సమయం ఇస్తున్నాం. పార్టీ వల్లే మనకు గౌరవం లభిస్తోంది. అహంకారం వల్లే వైసీపీ 11 సీట్లకు పరిమితమైంది.

- ఏపీ మంత్రి నారా లోకేశ్

ఓపెన్ వాయిస్

మావోయిస్టుల పోరాటం ముగిసిందా?

ఆపరేషన్ కగార్... మావోయిస్టులను కంగారు పెట్టేసింది. ఉడుకు రక్తంతో చావంటే తెలియని భయం... వయసు మీరిన తర్వాత వారి వెన్నులో వణుకు పుట్టించింది. మావోయిజంపై ఉక్కుపాదం మోపుతామని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలతో భయపెట్టింది. ఆ హెచ్చరికలను మావోయిస్టులు లైట్ తీసుకోవడంతో యాక్షన్ ప్లాన్ అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వాన్ని భయపెట్టిన మావోలు.. ఇపుడు వాళ్లనే ప్రభుత్వం భయపడే స్థితికి తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆపరేషన్ కగార్ చేపట్టిన భద్రతా బలగాలు అడవులను జల్లెడ పట్టింది. కనిపించిన మావోలను కనిపించనట్టుగా మట్టుబెట్టింది. ఆపరేషన్ కగార్... సత్ఫలితాలనిచ్చింది. మావోయిస్టు ఉద్యమంలో తలపండిన ఉద్ధండులు సైతం స్వచ్ఛందలొంగుబాటుకు దారితీసింది. దీంతో ఆ ఉద్యమం కనుమరుగైపోయింది. మావోయిస్టు ఉద్యమం రక్తాక్షరాలతో చరిత్రగా నిలిచిపోయింది. ఒకటే లక్ష్యం... భారత దేశంలో మావోయిస్టు ఉద్యమాన్ని కనుమరుగు చేయాలి. ఉద్యమంలో ఉన్నవారిని జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చి కొత్త జీవితాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. దీంతో తుపాకి వీడండి.. అడవుల్లో అజ్ఞాతం లోంచి జనజీవన స్రవంతిలో కలవండి అనే పిలుపుతో వెనుకాడిన మావోయిస్టులు.ఎన్ కౌంటర్ల తర్వాత స్వచ్ఛంద నిర్ణయంతో మనసు మార్చుకున్నారు. దీంతో మంచి నిర్ణయం తీసుకుని ప్రజాజీవితంలో గడిపేందుకు సమ్మతించారు. మావోయిస్టు ఉద్యమం ఒక చరిత్ర సృష్టించింది. ఇది నిజం. ప్రజా పాలనలో ప్రజా ఉద్యమంగా పురుడుపోసుకున్న మావోయస్టుల పోరాటం ముగిసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అడవుల్లో అన్నలు... పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఓ రకంగా చెప్పాలంటే కేంద్రం వాళ్లను మోకాళ్లపై నిలబెట్టిందనే చెప్పాలి. ఈ క్రెడిట్ అంతా కేంద్ర హోం మంత్రి అమిత్ షాకే దక్కుతుంది. భద్రతా బలగాలకు ఇచ్చిన స్వేచ్ఛతో పాటు పెరిగిన టెక్నాలజీని ఉపయోగించుకొని మావోయిస్టులను అష్ట దిగ్బంధనం చేశారు. మావోయిస్టు ఉద్యమంలో సుధీర్ఘకాలం పనిచేసిన అగ్రనేతలు దేవ్‌జీ, రాజిరెడ్డి, దామోదర్ , గంగన్న లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసిందనే చెప్పాలి. మావోయిస్టు పార్టీ చరిత్రలోనే ఇది అత్యంత కీలక లొంగుబాటుగా చెప్పవచ్చు.. మునుపెన్నడూ లేని రీతిలో ఒకేసారి నలుగురు అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలిశారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన పొలిట్ బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ ఎలియాస్ కుమ్ముదాదా , కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్ , తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ , రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్న డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున.. మిగిలిన ఇద్దరికీ రూ.20 లక్షల చొప్పున పునరావాసం చెక్కుల్ని అందించారు. రెండు నెలలుగా దేశవ్యాప్తంగా మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు.

ప్రతిపక్షం
హైదరాబాద్
బుధవారం
01.04.2026

మావోయిస్టులు ప్రభావం ఉన్న మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విప్లవాత్మ మార్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టుల అగ్రనేతలు ఒక్కొక్కరుగా... తమ అనుచరగణంతో పోలీసు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయారు.నక్సలైట్ల ఘాతుకానికి బలైన వారిలో అత్యధికులు పోలీసులు కాగా... పోలీసులకు సమాచారం అందించారని ఇన్ ఫార్మర్ల పేరుతో అమాయకులను దారుణంగా కాల్చిచంపేశారు మావోలు. ఈ దారుణాలతో ప్రభుత్వాలనే కాదు.. అడవీ ప్రాంత ప్రజానీకాన్ని మావోలు భయపెట్టారు. గ్రామాల్లో ఉన్నవారు భయపడుతూ.. నక్సలైట్లకు ఆశ్రయిం కల్పించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అన్ని సౌకర్యాలను సమకూర్చాలి. సమీప బ్యాంకులను దోపిడీ చేయడం, పారిశ్రామిక వేత్తలను, పెద్ద పెద్ద భూ స్వాములను, కాంట్రాక్టర్లను, రాజకీయ నాయకులను బెదిరించి ఆర్థిక వనరులు సమకూర్చుకునేవారు. మావోయిస్టుల మాట వింటేనే జీవితం.. వ్యతిరేకిస్తే మరణమే శాసనంగా అమలుచేశారు. వరుసగా జరిగిన పరిణామాలతో మావోయిస్ట్ అగ్ర నాయకురాలు పోతుల కల్పన అలియాస్ సుజాతక్క... పొలిట్ బ్యూరో సభ్యులు మల్లోజుల వేణుగోపాల్... కేంద్ర కమిటీ సభ్యులు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న... అగ్ర నాయకులంతా వరుసగా సుమారు 210 మంది మావోయిస్టులు పోలీసులకు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తెలంగాణకు చెందినవారే. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈయన మావోయిస్ట్ ఉద్యమంలో ప్రవేశించి అంచెలంచెలుగా అగ్ర స్థానానికి చేరుకున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల పిలుపుతో తుపాకీని పక్కనపెట్టి... అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆంక్షలు... అడవుల్లో గాలింపు చర్యలు... ఆపరేషన్ కగార్ అద్భుత ఫలితాలను ఇచ్చిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇకనుంచి అడవుల్లో తుపాకుల అలజడి వినపడదు. ఎదురు కాల్పులు జరగవు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు హెచ్చరికలుండవు.. అడవుల్లో ఎదురుకాల్పుల్లేని ప్రశాంత వాతావరణం నెలకొల్పాలనుకున్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందనే అభిప్రాయం పోలీసుల్లో వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ సంస్థల్లో ప్రైవేటీకరణ!

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని సమీక్షించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస హక్కులు, సముచిత వేతనం, మరియు స్థిరత్వం కల్పించాలి. లేకపోతే ఈ విధానం సమాజంలో అసంతృప్తి, అసమానతలను మరింత పెంచుతుంది. ఉద్యోగం అంటే కేవలం జీవనోపాధి కాదు. అది మనిషి గౌరవానికి ప్రతీక. ఆ గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత. సమాన పనికి సమాన వేతనం, కనీస భద్రత, ఉద్యోగ గౌరవం కల్పించడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుంది.

సంపతి రమేష్
7989579428

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితం హామీ ఇస్తుంది. విద్య, వైద్యం, ఉపాధి—ఇవి కేవలం హక్కులు మాత్రమే కాదు, సమానత్వ సమాజానికి పునాదులు. ఆర్థిక సంస్కరణల పేరుతో వచ్చిన ప్రైవేటీకరణ విధానం ఈ పునాదులనే దెబ్బతీస్తోంది. ప్రభుత్వ బాధ్యతలను విస్మరిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలలోనే ప్రైవేటీకరణకు తలుపులు తెరుస్తుంది. స్థిరమైన ఉద్యోగాల స్థానంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాల్లో ఉద్యోగుల నియమించడమే దీనికి ఉదాహరణ. ఈ విధానం ప్రారంభమైనప్పటి నుండి వేలాది మంది యువతకు ఉపాధి ఒక మాయమృగంలా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో 1990 దశకంలో కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ విధానం ప్రారంభమైనది. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణ కూడా కొనసాగుతుంది. ఈ విధానం నియంత్రణ లేకుండా విస్తరించడం వల్ల సమాజంలో అసమానతలు, అన్యాయాలు పెరిగాయి. ఇది కేవలం ఉద్యోగ విధానం కాదు, మానవ గౌరవం, కార్మిక హక్కులు, రాజ్యాంగ విలువలకు సంబంధించిన సమస్యగా మారింది. రాజ్యాంగ రిజర్వేషన్ స్ఫూర్తి దెబ్బతింటుంది.

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాల వల్ల నష్టాలు.

భారతదేశంలో ఔట్ సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవస్థ ఒక ఆర్థిక విధాన మార్పు ఫలితం. 1991లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణల తర్వాత, లిబరలైజేషన్, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ (LPG) విధానాలు దేశ ఆర్థిక దిశను పూర్తిగా మార్చాయి. ప్రభుత్వ రంగాన్ని తగ్గించి, ప్రైవేట్ రంగానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ మరియు ఔట్ సోర్సింగ్ విధానాలు విస్తరించాయి. ప్రభుత్వం ఖర్చులను తగ్గించుకోవడం, పరిపాలనా భారాన్ని తగ్గించడం, పనులను వేగంగా పూర్తి చేయడం కోసం కొన్ని సేవలను ఆధిపత్య కులాలకు సంబంధించిన ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం ప్రారంభించింది. ముఖ్యంగా క్లీనింగ్, భద్రత, డేటా ఎంట్రీ, ఆరోగ్యం, విద్య వంటి అనేక రంగాల్లో ఔట్‌సోర్సింగ్ అమలులోకి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో, పథకాల నిర్వహణలో ఈ ఉద్యోగులను నియమించుకుంటున్నారు. వీరిలో అత్యధిక బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల వారే. ఔట్ సోర్సింగ్ విధానం కాలక్రమేణా ఉద్యోగ నిర్మాణాన్ని పూర్తిగా మార్చేసింది. శాశ్వత ఉద్యోగాలను తగ్గించాయి. ఉద్యోగాల్లో తాత్కాలిక, అస్థిర ఉద్యోగాల పెరిగింది. మధ్యవర్తి ఏజెన్సీల ఆధిపత్యంతో కార్మిక హక్కులు బలహీనపడ్డాయి. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగం అంటే భద్రత, గౌరవం, పెన్షన్ వంటి హామీలు ఉండేవి. ఇప్పుడు అదే వ్యవస్థలో అనిశ్చితి, అసమానత పెరిగాయి. ఉద్యోగ భద్రత లేకపోవడం, భవిష్యత్తుపై నమ్మకం కోల్పోవడం, తక్కువ వేతనాలు, అదే పని చేసినా శాశ్వత ఉద్యోగులతో పోలిస్తే చాలా తక్కువ జీతంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. మరోవైపు రాజ్యాంగ హామీలకు విరుద్ధంగా నియామకాల్లో రిజర్వేషన్ పాటించక రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నారు. సామాజిక న్యాయం కోసం ఏర్పడిన రిజర్వేషన్ విధానాన్ని పక్కన పెట్టడం ద్వారా, అణగారిన వర్గాలకు మరింత అన్యాయం జరుగుతోంది. మధ్యవర్తుల పెత్తనం, ఏజెన్సీల ద్వారా వేతనాలు ఇవ్వడం వల్ల జీతంలో కోతలు పెరుగుతున్నాయి. అదనపు పనిభారం పెరిగింది. అంతిమంగా సామాజిక సంఘర్షణకు దార తీస్తున్నాయి.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

నీళ్లు, నిధులు ,నియామకాలు అనే నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించిన తెలంగాణలో కూడా అవుట్సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ విధానం కొనసాగడం గమనార్హం. ఎందుకంటే ఆనాడు ఈ విధానం ఉండదన్నారు. ఇప్పుడు ప్రత్యేక తెలంగాణలో మరింత విస్తరించి, దాదాపు ఐదు లక్షల మంది జీవితాలను ప్రభావితం చేస్తోంది. వీరంతా ప్రభుత్వ పనులను నిర్వర్తిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేదు. ఉద్యోగ భద్రత లేదు. కనీస వేతనం కూడా సరిపోని స్థాయిలో ఉంటుంది. ఏజెన్సీల ఆధీనంలో పనిచేస్తూ, మధ్యవర్తుల దోపిడీకి గురవుతున్నారు. రోజూ కష్టపడుతూ, నెలాఖరులో జీవనోపాధికి సరిపోని జీతంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఇది ఉద్యోగం కాదు——ఇది ఆధునిక వెట్టి చాకిరిగా మారింది. నిరుద్యోగ యువతకు అవకాశాలు తగ్గిపోతూ, అసమానతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మొన్న ధర్నా చౌక్(ఇందిరా పార్క్ దగ్గర) వద్ద పెద్ద ఎత్తున ఉద్యమించారు. వీరికి గౌరవప్రదమైన జీవితం కోసం. ఉద్యోగ భద్రత కోసం. రాజ్యాంగ హక్కుల సాధన కోసం గళమెత్తారు. కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి ప్రజా ప్రతినిధులు, సామాజిక ఉద్యమకారులు మద్దతుగా నిలిచారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తెలంగాణ ఎస్సీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల పక్షాన మాట్లాడారు. కల్వకుంట్ల కవిత మిలియన్ మార్చ్ తరహాలో 5 లక్షల కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల సాధనకు ఆఫ్ మిలియన్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. విశారదన్ మహారాజ్ అవుట్సోర్సింగ్ మరియు కాంటాక్ట్ ఉద్యోగుల సమస్యలో భాగమై పోరాడుతామని పిలుపునిచ్చారు. ఇప్పటికే డాక్టర్ విశారదన్ జాక్

ఆధ్వర్యంలో అనేక ప్రజా సమస్యలపై ఉద్యమించారు. ఇటీవల కుమ్మెర ఘటన, వెలుగుమట్ల భూదాన్ సమస్యపై పోరాడారు. ఇప్పుడు ఈ ఔట్సోర్సింగ్ మరియు కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయాలని విశారదన్ మరియు కవిత పోరాటం ఆ ఉద్యోగుల్లో ఆశలను రేకెత్తిస్తుంది. కాబట్టి ప్రభుత్వం ఈ విధానాన్ని పునర్విమర్శించడం అత్యవసరం. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ఔట్ సోర్సింగ్ విధానాన్ని సమీక్షించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస హక్కులు, సముచిత వేతనం, మరియు స్థిరత్వం కల్పించాలి. లేకపోతే ఈ విధానం సమాజంలో అసంతృప్తి, అసమానతలను మరింత పెంచుతుంది. ఉద్యోగం అంటే కేవలం జీవనోపాధి కాదు. అది మనిషి గౌరవానికి ప్రతీక. ఆ గౌరవాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత. సమాన పనికి సమాన వేతనం, కనీస భద్రత, ఉద్యోగ గౌరవం కల్పించడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుంది. లేదంటే ఔట్ సోర్సింగ్ వ్యవస్థ అభివృద్ధి పేరుతో దోపిడీకి ప్రతీకగా మిగిలిపోతుంది.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్నేళ్లు?

సుధాకర్.ఏ.వి
9000674747

ఏ సంస్థలో పనిచేసే ఉద్యోగులైనా, ఉపాధ్యాయులైనా, కార్మికులైనా ఆ సంస్థ అభివృద్ధిలో భాగస్థులై పనిచేస్తుంటారు.ఆ క్రమంలో వారు ఆర్థికంగా,సామాజిక భద్రతతో కూడిన ఆరోగ్యకరమైన జీవనాన్ని కోరుకుంటారు. అది రాజ్యాంగ పరంగా,కార్మిక చట్ట పరంగా వాళ్ళకు సంక్రమించిన న్యాయమైన హక్కు.తమ వద్ద పని చేసే వారి సంక్షేమం కొరకు కృషి చేయడం ప్రభుత్వం లేదా యాజమాన్యం యొక్క బాధ్యత.ఆసంక్షేమంలో భాగంగా కాలానుగుణంగా జీతాల పెంపు,కరువుభత్యం వంటివి ప్రకటించి ఆర్థిక పరిపుష్టిని కలిగించడం, పదోన్నతులు కల్పించడం,ఆరోగ్య సంరక్షణ వంటి పథకాలను అమలు చేయడం వంటివి చేయాలి.ఉద్యోగులు కూడా ప్రజలే. కాబట్టి ఉద్యోగ సంక్షేమం ప్రజా సంక్షేమంలో భాగంగానే ప్రభుత్వం గుర్తించాలి.అయితే కొన్నిసార్లు ఆయా ప్రభుత్వాలు, యాజమాన్యాలు న్యాయంగా ఉద్యోగులకు లభించాల్సిన వాటికి ఇవ్వకుండా వారి హక్కులను కాలరాస్తూ తాత్సారం చేస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నపుడు ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం వహించే సంఘాలు రంగంలోకి దిగి ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడి హక్కులను కాపాడుకుంటాయి. ఉద్యోగుల న్యాయపరమైన సౌకర్యాలను పొందుతాయి. ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక సంఘాల ఉద్యమం చరిత్రలో ఇట్లాంటి సంఘటనలు కోకొల్లలు. సంఘేశక్తి': 'అన్నట్లుగా సంఘ బలానికి మించిన బలం లేదని నిరూపించాయి. అటువంటి గొప్ప చరిత్ర కలిగిన సంఘాలు ఉండి కూడా నేడు ఉద్యోగ,ఉపాధ్యాయులకు న్యాయంగా రావలసిన PRC, DAలు గురించి పదే పదే అడుక్కోవలసిన పరిస్థితి. అట్లాగే ఏండ్ల తరబడి సమస్యలు పేరుకుపోవడం, ఉద్యోగ విరమణ తరువాత ఆర్థికంగా సామాజిక భద్రతను కల్పించే పెన్షన్ హక్కును కోల్పోడం.CPS విధానం రద్దు కాకపోవడం, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆరోగ్య సంరక్షణకై అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో చెల్లుబాటయ్యే అయ్యే విధంగా ఆరోగ్య కార్డులను మంజూరు చేయడ, విద్యారంగాన్ని ప్రయోగశాలగా మార్చి అసమగ్రంగా ఉన్న CCE విధానం లాంటివి ప్రవేశపెట్టి అమలు చేయడం వంటి ఎన్నో మరెన్నో సమస్యలు పరిష్కారం కాక పోవడానికి కారణం ఏమిటి? ఎన్నాళ్ళీ చలనం లేని బతుకు? ఈ వైఫల్యం ప్రభుత్వానిదా? సంఘాలదా? అని అంతరాత్మలో ప్రశ్నించుకోనే ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు కారణాలను అన్వేషించాలి.అధ్యయనం చేయాలి. విశ్లేషించుకొని వాస్తవాలు గ్రహించాలి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెసు సర్కారు ఏర్పడి రెండేళ్లు దాటిని ఉపాధ్యాయుల సమస్యకు ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశగా ఓపికగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. కాలమెప్పుడూ ఒకే తీరుగా ఉండదు. తమ అపరిష్కృత సమస్యలపై ఉద్యోగ ఉపాధ్యాయులకు అసహనం పెరిగింది.ఉద్యమ నేపథ్యం కలిగిన సంఘాలవైపు ఉపాధ్యాయుల ఆశగా చూస్తున్నారు.ఆ క్రమంలోనే ఉద్యమ చరిత్ర కలిగిన ఎస్టీయూ, యూటిఎఫ్ వంటి సంఘాలు భావ సారూప్యత కలిగిన మరికొన్ని సంఘాలలో జాక్టో యూ.ఎస్.పి.సి గా ఏర్పడి కొన్ని ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలతో కలిసి అతి పెద్ద కూటమిగా ఏర్పడి సమస్యల పరిష్కారం ఉద్యమించుటకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్షనర్ల సమస్యలను తాత్సారం చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఐదు డిఏ లు పెండింగ్ లో ఉన్నాయి.ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం ముప్పై సంవత్సరాలకు పైగా సర్వీసు చేసిన ఉద్యోగులకు ఉద్యోగ విరమణ బకాయిలు చెల్లించకపోవడం తదితర సమస్యలతో విసిగి వేశారిపోయిన ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల వారు ఉద్యమ సంఘాలు ఎప్పుడూ

ధర్నాకు పిలుపునిస్తాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులను సాధించుట కొరకు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేయడానికి పైరవీకారులను నిరోధించడానికి ప్రజాస్వామ్య పరిరక్షణకు ఐక్యవేదికలు ఏర్పడ్డాయి.ఈ పోరాట సంఘాల ఐక్యవేదికలకు అండగా నిలుద్దాం. మన హక్కులను కాపాడుకుందాం. సమస్యలను పరిష్కరెయ కుందాం.ఆ దిశలో సీనియర్ ఉద్యమ సంఘంగా ఎస్టీయూ సమస్యల పరిష్కారానికి కీలక భూమిక పోషిస్తున్నందుకు ఎస్టీయూ సభ్యులుగా మనందరం గర్వించాలి.

(వ్యాసకర్త రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ)

కోర్టు మెట్లు ఎక్కుతున్న కాపురాలు

ఫిరోజ్ ఖాన్
9640466464

నేటి సమాజంలో వివాహ బంధం భావోద్వేగాలకే పరిమితం కాకుండా ఆర్థిక బాధ్యతలతో ముడిపడుతోంది. పట్టణీకరణ, మహిళల ఆర్థిక స్వావలంబన, ద్వంద్వ ఉపాధి కుటుంబాల పెరుగుదలతో విడాకుల సందర్భాల్లో భరణం ప్రధాన చర్చగా మారుతోంది. న్యాయ మంత్రిత్వ శాఖకు సమర్పించబడిన పలు నివేదికలు, కుటుంబ కోర్టుల వార్షిక గణాంకాలు సూచిస్తున్న దాని ప్రకారం, మెట్రో నగరాల్లో కుటుంబ వివాదాల నమోదు పెరుగుతున్న ధోరణి కనిపిస్తున్నట్లు అర్థమవుతోంది. ఇది సంబంధాల మార్పుకే కాకుండా, చట్టాలపై పెరిగిన అవగాహనకు కూడా సూచికగా భావించబడుతోంది. భరణం వ్యవస్థ ఉద్దేశం ఆర్థికంగా బలహీన భాగస్వామిని రక్షించడం అన్న మూల సూత్రాన్ని గుర్తు పెట్టుకోవడం అవసరం.

పట్టణ పరుగులో బీటలు వారుతున్న బంధాలు

ఉద్యోగ ఒత్తిడి, వర్క్‌లైఫ్ అసమతుల్యత, ఆలస్య వివాహాలు, అణు కుటుంబాల పెరుగుదల వంటి అంశాలు దాంపత్య విభేదాలను వేగవంతం చేస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి మెట్రో నగరాల్లో కుటుంబ కోర్టుల కేస్ లోడ్‌పై వచ్చిన విశ్లేషణలు కొత్త పిటిషన్ల సంఖ్య పెరుగుతున్నట్లు న్యాయ వర్గాలు సూచిస్తున్నాయని తెలియజేస్తున్నాయి. న్యాయవర్గాల ప్రకటనలు, బార్ అసోసియేషన్ నివేదికలు కూడా ఇదే ధోరణిని బలపరుస్తున్నాయి. అదే సమయంలో, లీగల్ ఎయిడ్ సేవలు, కుటుంబ కోర్టుల విస్తరణ వల్ల న్యాయానికి చేరుకోవడం సులభమవడం కూడా కేసుల నమోదుకు ఒక కారణంగా భావించబడుతోంది.

పారదర్శకతకు బలమైన అడుగులు

భరణం కేసుల్లో పారదర్శకతను పెంచేందుకు సుప్రీం కోర్టు ఇచ్చిన రజనీష్ వర్సెస్ నేహా (2020) తీర్పు కీలక మలుపుగా నిలిచింది. ఈ కేసులో భార్యాభర్తలు ఇద్దరూ తమ ఆదాయం, ఆస్తులు, అప్పుల వివరాలను అఫిడవిట్ రూపంలో తప్పనిసరిగా వెల్లడించాలి అని స్పష్టం చేసింది. అనంతరం పలు హైకోర్టులు కూడా తప్పుడు అఫిడవిట్‌లు, ఆదాయం దాచడంపై కఠిన వ్యాఖ్యలు చేస్తూ, నిజమైన ఆర్థిక పరిస్థితిని వెలికి తీయడంపై దృష్టి సారిస్తున్నాయి. కోర్టు ఆదేశాలు, జడ్జిమెంట్ నోట్స్ భరణం నిర్ణయాల్లో ఆధారాల ప్రాముఖ్యతను బలపరుస్తున్నాయి. ఆర్థికంగా బలహీన భాగస్వామికి కనీస జీవన భద్రత కల్పించడం భరణం చట్టాల ప్రధాన లక్ష్యం. ఇటీవలి న్యాయ తీర్పులు భరణం హక్కు లింగపరంగా కాకుండా పరిస్థితుల ఆధారంగా నిర్ణయించవచ్చని స్పష్టం చేస్తున్నాయి. జీవన ప్రమాణం, ఆదాయం, విద్య, ఆరోగ్యం, ఆధారపడిన వారి సంఖ్య వంటి ప్రమాణాలను కోర్టులు పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

ప్రపంచం చూపిస్తున్న మార్గం

ప్రపంచవ్యాప్తంగా భరణం చట్టాలు సమానత్వం దిశగా అభివృద్ధి చెందుతున్నాయి. అమెరికాలో అనేక రాష్ట్రాల్లో అధిక ఆదాయం ఉన్న భాగస్వామి లింగభేదం లేకుండా



భరణం చెల్లించాల్సి ఉంటుంది. బ్రిటన్‌లో వైట్ వర్సెస్ వైట్ (2000) తీర్పు తర్వాత ఆస్తుల సమాన పంపిణీ సూత్రం బలపడింది. కెనడా, ఆస్ట్రేలియా మార్గదర్శకాలు ఆదాయ భాగస్వామ్యంపై స్పష్టతను ఇస్తున్నాయి. అదనంగా, ఫోరెన్సిక్ ఆడిట్, డిజిటల్ ఫైనాన్షియల్ ట్రాకింగ్, బ్యాంకింగ్ ట్రైల్ విశ్లేషణ వంటి పద్ధతులు ఆర్థిక వివరాలను ఖచ్చితంగా వెలికి తీయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని దేశాల్లో ప్రెనప్షువల్ అగ్రిమెంట్లు వివాదాలను ముందుగానే తగ్గించడంలో సహాయపడుతున్నాయి. ఇవి భారతదేశంలో కూడా చర్చకు వస్తున్న అంశాలుగా నిలుస్తున్నాయి.

గెలుపు కాదు... సమతుల్యతే నిజమైన పరిష్కారం

విడాకుల వ్యవహారాల్లో 'ఎవరు గెలిచారు?' అన్న ప్రశ్న కంటే, న్యాయం జరిగిందా? ఇద్దరూ గౌరవంగా ముందుకు సాగగలిగారా? అన్నదే అసలు ప్రశ్న. కోర్టు తీర్పుల ధోరణి, న్యాయవర్గాల అభిప్రాయాలు కూడా ఇదే దిశలో సాగుతున్నాయి. భరణం ఒక రక్షణ వ్యవస్థగా ఉండాలి గాని, వివాదాలను మరింత తీవ్రమయ్యే సాధనంగా మారకూడదు. పారదర్శక ఆర్థిక వెల్లడనలు, వేగవంతమైన విచారణ, సమతుల్య చట్ట అమలు ద్వారా మాత్రమే సమాజంలో విశ్వాసం పెరుగుతుంది. విడాకుల యుద్ధంలో గెలుపు అనే భావనకు బదులుగా సమతుల్యత, న్యాయం, గౌరవం నిలవడం నిజమైన పరిష్కారం.

(వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

అతివల ఉచిత బస్ ప్రయాణంతో అభివృద్ధి దిశగా ఆర్టీసీ

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి
- 290 కోట్లు దాటిన మహిళల ఉచిత బస్సు ప్రయాణాలు
- 10 వేల కోట్లు మహిళలకు అదా

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట, మార్చ్ 31: రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రారంభించిన తొలి పథకం మహాలక్ష్మి పథకమే అని, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేసిన వెంటనే మహిళలకు ఉచిత ప్రయాణ బస్ ను సీఎం ప్రారంభించారని, 2023 డిసెంబర్ 3 న రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 290 కోట్లకు పైగా మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేయడంతో రూ. 10 వేల కోట్లకు పైగా అదా అయిందని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 290 కోట్ల మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించిన సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో మక్తల్ బస్టాండ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఉచిత బస్ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. పుట్టింటికి వెళ్ళాలంటే భర్త, కొడుకు తో మహిళలు డబ్బు అడిగే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు మహిళలు నయా పైసా ఖర్చు పెట్టకుండా రాష్ట్రంలో ఏ పుణ్యక్షేత్రానికైనా వెళ్లి రావచ్చని, విద్యార్థినిలు, యువతులు పాఠశాలల,కళాశాలకు వెళ్లవచ్చనీ ఆయన స్పష్టం చేశారు. గతంలో ఆర్టీసీ కార్మికులు 56 రోజుల పాటు నిరసన చేసినా, 50 మంది కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని మంత్రి ఎద్దేవా చేశారు. కానీ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ నీ ఆదుకోవాలని, బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని సీఎం సంకల్పించి మహాలక్ష్మి పథకం అమలు చేయడంతో నాడు నష్టాల్లో ఉన్న ఆర్టీసీ నేడు ఆదాయం దిశగా దూసుకెళ్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులను కొనుగోలుకు జిల్లాలోని 11 మండలాల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం 30 లక్షల చొప్పున రుణాలు ఇచ్చిందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం ఏమైనా చేయడానికి సిద్ధంగా ఉందని, జిల్లాలో మహిళల భద్రత, గౌరవాన్ని కాపాడే బాధ్యత జిల్లా అధికారులపై ఉందని తెలిపారు. మహిళలను గౌరవిస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. మక్తల్ నియోజకవర్గంలో తారు రోడ్డు లేని ఊరు అంటూ ఉండదని, అలాగే రోడ్డు ఉన్న ప్రతీ ఊరికి ఆర్టీసీ బస్సును నడిపించాలని, ముఖ్యంగా పాఠశాలల సమయానికి ఆయా గ్రామాలకు బస్సులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య కు మంత్రి సూచించారు. మక్తల్ నియోజక వర్గ కేంద్రంలో రూ.5 కోట్లతో నూతనంగా ఆర్టీసీ బస్ స్టాండ్ ను ఏర్పాటు చేసుకుందాం అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి గొప్ప పథకం అన్నారు. మహిళల చేతుల్లోనే డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈ పథకంతో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల కోట్లు ఆదా అయిందన్నారు. మహిళల ఉచిత బస్ ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కొత్త కొత్త పథకాలు తీసుకువచ్చే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ మొగులప్ప, మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ మానస హన్మంతు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం

- పాఠశాల, అంగన్వాడి కేంద్రాలపై కలెక్టర్ సమగ్ర పరిశీలన

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , మార్చి 31: జిల్లాలో విద్యా మరియు శిశు సంక్షేమ సేవల అమలు పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడి వసతులు, సేవల నాణ్యతపై సమగ్రంగా పరిశీలించారు. మొదట ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, తరగతి గదుల పరిస్థితి, పరిశుభ్రత, మరుగుదొడ్లు, త్రాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పాఠశాల పరిసరాలు, కాంపౌండ్ వాల్ వంటి మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం బాగుందని విద్యార్థులు తెలపడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, ప్రతి విద్యార్థి చదువు పై దృష్టి పెట్టాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలోని వంటగది, పరిశుభ్రత, పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు గుడ్డు మరియు ఇతర పౌష్టికాహారం అందుతున్నదా అని ఆరా తీశారు. చిన్నారుల శారీరక మరియు మానసిక అభివృద్ధికి పౌష్టికాహారం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సరైన మోతాదులో పోషకాహారం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, త్రాగునీరు, చల్లని వాతావరణం కల్పించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్, ఇండ్ల ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం అనంతరం మోనిన్ పరిశ్రమను సందర్శించి పరిశీలించిన కలెక్టర్ పరిశ్రమలో అమలవుతున్న భద్రతా చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అశోక్, ఎంపీడీవో వేణుగోపాల్, సర్పంచ్ అనంతరెడ్డి, హౌసింగ్ ఏఈ,తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత భారత్‌కు
ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

- మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్
- పెద్దమంగళారంలో ఘనంగా వైద్య శిబిరం
- క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ
- మున్సిపల్ కమిషనర్ పిలుపు

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 31 : దేశాన్ని టీబీ రహితంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'టీబీ ముక్త భారత్' అభియాన్ మొయినాబాద్ మండలంలో ఉత్సాహంగా సాగుతోంది. మంగళవారం పెద్దమంగళారం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం టీబీ నిర్మూలనకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఎవరికైనా టీబీ లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనలు పాటించాలని ఆయన కోరారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా పరీక్షలు జిల్లా వైద్య అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో భాగంగా.. గ్రామస్థులకు ఉచితంగా రక్త పరీక్షలు, షుగర్ టెస్టులు మరియు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి తగిన వైద్య సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ పాటి పావని టీబీ బాధితులకు పోషకాహార (న్యూట్రిషన్) కిట్లను పంపిణీ చేశారు. రోగులు త్వరగా కోలుకోవడానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ శిబిరానికి విచ్చేసిన వైద్య బృందానికి మాజీ సర్పంచ్ చేగురి రామకృష్ణ గౌడ్ భోజన వసతులు కల్పించి తన ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అన్నపూర్ణ, లక్ష్మి నర్సింహా, టీబీ సూపర్‌వైజర్ మాధవి, మెడికల్ సిబ్బంది అక్రమ్, శోభ, సునీతతో పాటు ఆశా వర్కర్లు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మిస్టరీ వీడిన చోరీ కేసు

- పాత నేరస్థుడితో పాటు మరొకరు అరెస్ట్!

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 31: మండల పరిధిలోని కాశింబౌలి గ్రామంలో ఇటీవల సంచలనం సృష్టించిన గృహ చోరీ కేసును మొయినాబాద్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. కేవలం ఐదు రోజుల్లోనే నిందితులను గుర్తించి, వారి నుంచి దొంగిలించిన సొత్తును రికవరీ చేశారు. మంగళవారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. గత నెల 26న కాశింబౌలిలో ఒక ఇంటి తాళాలు పగలగొట్టిన దొంగలు, బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును ఊడ్చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టారు. మంగళవారం మొయినాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు దొంగతనం వెలుగులోకి వచ్చింది. పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. పట్టుబడిన వారిలో బైరమకొండ శ్రీనివాస్ అలియాస్ శ్రీను (ఏ1) ఇతను పాత నేరస్థుడు, మేకల శివకుమార్ అలియాస్ శివ (ఏ2) శ్రీనుతో కలిసి దొంగతనానికి పాల్పడ్డాడు. వారి వద్ద నుంచి భారీగా బంగారు, వెండి వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మహిళలకు ఎంతో ప్రయోజనం మహాలక్ష్మి పథకం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 31: రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం డిసెంబర్ 9, 2023 నుండి విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకం ద్వారా మహిళలు విస్తృతంగా ప్రయాణాలు చేసి ఇప్పటి వరకు సుమారు 290 కోట్ల ప్రయాణాలు చేసి దాదాపు ₹10,000 కోట్ల మేర ఆదా చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి సంబంధించి పదివేల కోట్ల రూపాయల మేర ఆదా చేరుకోవడం పై హనుమకొండ బస్ స్టేషన్ లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు జీరో టికెట్ ద్వారా ఉచితంగా ప్రయాణించేందుకు తోడ్పడుతుందని అన్నారు. మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకొని ఆర్థికంగా లాభపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిత్యం బస్సుల్లో ప్రయాణించే పలువురు మహిళా ప్రయాణికులను ఆర్టీసీ అధికారులు శాలువాలు, బహుమతులతో సత్కరించారు. వారిలో మల్లికుదుర్ల నుండి హనుమకొండకు ఉన్నత విద్య కోసం ప్రయాణించే విద్యార్థిని బి కావ్య, స్వీపర్‌గా పనిచేస్తూ ప్రయాణించే పి భాగ్య, వ్యవసాయ పనుల నిమిత్తం ప్రయాణించే ఎస్ హైమావతి, స్వయం సహాయక సంఘ సభ్యురాలు రంజనా, ఖమ్మం నుండి వైద్య సేవల కోసం నిత్యం ప్రయాణించే జి రుక్మిణి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రీజనల్ మేనేజర్ ఎస్ భవాని ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్స్) కేశరాజు భాను కిరణ్, వరంగల్ వన్ డిపో మేనేజర్ పుప్పాల అర్పిత, సూపర్వైజర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.

టెన్త్ పరీక్షా హాలులోకి 'ఫోన్'తో వెళ్లిన విద్యార్థి

- సూపరింటెండెంట్ సస్పెన్షన్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చ్ 31: మహేశ్వరం మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రం మోడల్ స్కూల్ లో ఓ విద్యార్థి 'ఫోన్' తీసుకెళ్లడం చర్చనీయాంశమైంది. ఈ సంఘటనలో బాధ్యునిగా తేలుస్తూ చీఫ్ సూపరింటెండెంటుగా విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ ఇ.గోపిని అధికారుల సస్పెండ్ చేశారు. మార్చి 28 న గణితం పరీక్ష రోజు ఒక విద్యార్థి పరీక్ష హాల్లోకి ఫోన్ తీసుకెళ్లిన విషయం విద్యార్థి యొక్క ఫోన్ రింగ్ కావటం వలన గుర్తించారు. అతని నుంచి ఫోన్ తీసుకొని పోలీసు స్టేషనులో అప్పగించారు. పరీక్ష హాల్లోకి వెళ్ళే ముందు ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపాల్సి వుంటుంది. పరీక్షల విధుల్లో ఉన్న అధికారుల నిర్లక్ష్యం వలన ఈ సంఘటన జరిగిందని ధ్రువీకరించారు. అదే విధంగా ఇట్టి విషయాన్ని చీఫ్ సూపరింటెండెంట్ ఇ.గోపి,జిల్లా అధికారుల దృష్టికి తీసుకపోలేదని ప్రాథమిక విచారణలో తేలింది. ఈ విషయం పత్రికల ద్వారా తెలుసుకున్న డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ పీవీ శ్రీహరి సూపరింటెండెంట్ ను పరీక్షల విధుల్లోంచి తొలగించి షోకాజ్ నోటీసులు జారీ చేయమని డిఈవో కి ఆదేశాలు జారీ చేశారు. ఇ.గోపి స్థానంలో సీనియర్ టీచర్ అంబిక చీఫ్ సూపరింటెండెంటుగా విధులు నిర్వహిస్తున్నారు.జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలానుసారం నోటీసుకి వివరణ అందిన తర్వాత విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షల విధుల్లో సైతం నిర్లక్ష్యం వహించినందుకు ఇరవై రోజుల క్రితం విధుల్లో నుంచి తప్పించడం గమనార్హం.

వార్డు సభ్యులకు శిక్షణ

- సర్టిఫికేట్లు అందజేసిన ఎంపీడీవో సంధ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 31 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు వేడుకలకు హాజరైన మండల అభివృద్ధి అధికారిణి సంధ్య శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని, ప్రభుత్వ నిధులు, విధులను సద్వినియోగం చేసుకుంటూ ఆదర్శ వార్డులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వార్డు సభ్యులు సామ్యూల్, రాజు, కీర్తి, మాధవి, దీన, అమరేందర్, సుమలత, రమేష్, ప్రభాకర్, జంగయ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను వేగవంతం చేయాలి

- అధికారులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి
- కందకుర్తి పుష్కరఘాట్ సందర్శన

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 31 : వచ్చే ఏడాది జూలైలో అట్టహాసంగా జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఏర్పాట్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షం రోజుల క్రితం కూడా ఈ పుష్కర ఘాట్ ను సందర్శించిన సమయంలో అధికారులకు పురమాయించిన పనులను వారు ఏమేరకు చేపట్టారు అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. పుష్కర ఘాట్ కు వచ్చే మార్గాలలో రహదారుల మరమ్మతులు, విస్తరణ పనులను, శివాలయం వద్ద కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అన్నారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు భక్తులకు కనీస వసతులు అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటి వాటిని నాణ్యతతో చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ కందకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెంజల్ మండల అధికారులతో సమావేశం అయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, జనాభా గణన ప్రక్రియల నిర్వహణపై కీలక సూచనలు చేశారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ అధికారులు కమల, విజయరామారావు, తహసిల్దార్ శ్రవణ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ అధికారులు ఉన్నారు.



ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కోసం ఉద్యమంలా కృషి చేయాలి. సంజీవని ప్రాజెక్టు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, వైద్యాధికారులు జనాల్లోకి వెళ్లాలి. ప్రతి నాలుగో శనివారం స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్ పేరుతో గ్రామ సభలు, హెల్త్ క్యాంపులు నిర్వహించాలి. ఏడాదిలో 56 లక్షల మందికి వైద్య పరీక్షలు చేయాలి. ఫలితాలను 48గంటల్లో వాట్సాప్ ద్వారా పంపాలి.

- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట

- మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం
- ప్రభుత్వ సలహాదారు పోచారం

ప్రతిపక్షం, బాన్సువాడ, మార్చి 31: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా 2023 డిసెంబర్ 09 తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో ఉచితంగా ప్రయాణించిన మహిళా ప్రయాణికులు సుమారుగా 290 కోట్లు కాగా ప్రయాణికులు ఆదా చేసుకున్న మొత్తం 10,000 కోట్ల రూపాయలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ బస్ స్టాండ్ లో బాన్సువాడ డిపో మేనేజర్ రవి కుమార్ ఆధ్వర్యంలో ఈరోజు మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు,10,000కోట్లు ఆదా చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సంబరాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బాన్సువాడ డిపో నుండి మహాలక్ష్మి పథకం ప్రారంభమయిన నుండి 30 మార్చి 2026 వరకు ఉచితంగా ప్రయాణించిన మహిళా ప్రయాణికులు 2.42 కోట్లు కాగా ప్రయాణికులు ఆదా చేసుకున్న మొత్తం రూపాయలు 90.32 కోట్లని వివరించారు. రూ 10000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా చేసుకున్న సందర్భంగా రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా పలువురు మహిళలను పోచారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు ఎర్వల కృష్ణారెడి, కాసుల రోహిత్, జంగం గంగాధర్, నర్ల రవీందర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతోపాటు, తలపై హెల్మెట్ తప్పనిసరి

- ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకోవడం సమస్యలకు పరిష్కారం కాదు
- జిల్లా పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాల్

ప్రతిపక్షం, గజ్వేల్ (ములుగు), మార్చ్ 31: ప్రాణ భద్రత కోసం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాల్ సూచించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, అజాగ్రత్త వాహనదారణ వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. ములుగు మండలం వంటిమామిడి గ్రామంలోని ఆర్.వి.ఎం మెడికల్ కళాశాలలో 'అరైవ్ అలైవ్' పేరుతో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు మంగళవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాల్, హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రాణాపాయానికి దారితీస్తుందని, అజాగ్రత్తగా వాహనాలు నడిపి అమూల్యమైన ప్రాణాలను కోల్పోవద్దని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలు మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, ఒక్కసారి తప్పుడు మార్గంలో నడిస్తే అది జీవితాన్ని, కెరీర్‌ను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, అది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులు పరస్పరం స్నేహభావంతో మెలగాలని, వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని గుర్తుచేశారు. ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకోవడం సమస్యలకు పరిష్కారం కాదని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సీనియర్లు లేదా అధ్యాపకులను సంప్రదించాలని సూచించారు. అనంతరం కమిషనర్ హాస్పిటల్‌లోని సీసీటీవీ మానిటరింగ్ వ్యవస్థను తనిఖీ చేసి, భద్రతాపరంగా నిరంతర నిఘా కొనసాగించాలని సిబ్బందికి ఆదేశించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు వెంటనే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నర్సింలు, గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు, ములుగు ఎస్ఐ రఘుపతి, హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు మరియు ఆసుపత్రి ఆడిటోరియం నిండుగా విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్త నుంచి రాష్ట్ర నాయకత్వం వరకు...

- అంబటి బాలేష్ గౌడ్ మూడోసారి ముద్ర

ప్రతిపక్షం, సిద్దిపేట, మార్చి 31: దుబ్బాక రాజకీయాల్లో నిశ్శబ్దంగా కానీ ప్రభావవంతంగా ఎదిగిన నాయకుల్లో అంబటి బాలేష్ గౌడ్ పేరు ప్రత్యేకంగా నిలుస్తుంది. పార్టీ పట్ల అంకితభావం, క్రమశిక్షణ, సంస్థాగత పనితీరుతో ఆయన ప్రయాణం ఒక సాధారణ కార్యకర్త నుండి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగిన కథగా నిలిచింది. తాజాగా ఆయనను మూడోసారి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించడం, పార్టీ లో ఆయనకు ఉన్న ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేస్తోంది. చిన్నప్పటి నుంచే ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ వంటి జాతీయవాద సంస్థల్లో చురుకుగా పనిచేసిన బాలేష్ గౌడ్, ఆ విలువలను తన రాజకీయ జీవితంలోనూ కొనసాగించారు. 2000 సంవత్సరంలో దుబ్బాక పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. మండల బీజేవైఎం అధ్యక్షుడిగా, నియోజకవర్గ ప్రచార కార్యదర్శిగా, అసెంబ్లీ కన్వీనర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు బలమైన సంస్థాగత పునాది ఏర్పరిచింది. తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండు సార్లు పనిచేసి, జిల్లాల పునర్విభజన అనంతరం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూడా తన సామర్థ్యాన్ని చాటారు. పార్టీ నిర్మాణం, కార్యకర్తల సమన్వయం, ఎన్నికల వ్యూహాలలో ఆయన చూపిన చురుకుదనం కారణంగా ఆయనను రాష్ట్ర స్థాయి బాధ్యతలకు ఎంపిక చేయడం సహజంగా మారింది. ఇప్పటికే రెండు సార్లు

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేసిన ఆయనను మూడోసారి అదే పదవికి నియమించడం ఆయన పనితీరుకు దక్కిన గౌరవం. గత 26 సంవత్సరాలుగా పార్టీ లో ఏదో ఒక బాధ్యతలో కొనసాగుతున్న బాలేష్ గౌడ్, ఎప్పుడూ క్రియాశీలకంగా పనిచేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా ఉపఎన్నికలు, కీలక ఎన్నికల సమయంలో పార్టీ ఆయనపై ఉంచిన నమ్మకం ఆయన సామర్థ్యానికి నిదర్శనం. హుజురాబాద్, మునుగోడు ఉపఎన్నికల సమయంలో ఇంచార్జిగా పనిచేసి పార్టీకి బలమైన మద్దతు సమీకరించడంలో కీలక పాత్ర పోషించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో సంస్థాగత నిర్మాణం బలోపేతానికి కూడా కృషి చేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో వేములవాడలో ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహించి తన నిర్వహణా నైపుణ్యాన్ని మరోసారి చాటారు. బాలేష్ గౌడ్ ప్రత్యేకత ఏమిటంటే, ఆయనకు అప్పగించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించడం. పార్టీ సిద్ధాంతాలపై ఆయనకు ఉన్న విశ్వాసం, నాయకత్వంపై నమ్మకం, కార్యకర్తలతో సమన్వయం ఆయనను ఇతర నాయకుల నుండి భిన్నంగా నిలబెడుతుంది. పైగా, స్థానిక స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పనిచేసిన అనుభవం ఆయనకు విస్తృత దృష్టిని అందించింది. తాజాగా మూడోసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించబడిన సందర్భంగా బాలేష్ గౌడ్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. రాబోయే 2028 ఎన్నికలలో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం లక్ష్యంగా శక్తివంచన లేకుండా పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా చూస్తే, అంబటి బాలేష్ గౌడ్ రాజకీయ ప్రయాణం ఒక క్రమశిక్షణతో కూడిన కష్టపడి సాధించిన విజయ గాథ. పార్టీ పట్ల నిబద్ధత, కష్టపడే తత్వం, సంస్థాగత నైపుణ్యం కలిగిన నాయకుడిగా ఆయన భవిష్యత్తులో మరింత కీలక బాధ్యతలు చేపట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో ఆయన పాత్ర మరింత విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ప్రతిపక్షం, చేగుంట, మార్చి 31: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. చేగుంట పోలీస్ స్టేషన్ లో లైన్స్ క్లబ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మూడవ విడత ఆలైవ్ అరైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహన చోదకులు ఎలిమెంట్ ధరించకపోవడం సెల్ ఫోన్ మాట్లాడడం అతివేగంగా వాహనాలు తోలడం త్రిబుల్ రైడింగ్ చేయడం వంటి అనేక కారణాలవల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా యువత డ్రైవింగ్ లైసెన్సులు పొందాలని సూచించారు. లయన్స్ క్లబ్ ఐశ్వర్య ఆప్టికల్స్ పోలీస్ శాఖ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఎంతోమందికి మేలు జరుగుతుందన్నారు. మాసాయిపేట రైల్వే ట్రాక్ ప్రమాదాన్ని మరణించిన కుటుంబాలను ఎస్పీ శ్రీనివాసరావు గుర్తు చేశారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి రామాయంపేట సిఐ చేగుంట ఎస్సై లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల 'టీకా శిబిరం'

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 31: మెదక్ జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ ఆధ్వర్యం, జిల్లా హజ్ సొసైటీ సహకారంతో మెదక్ జిల్లా నుండి ఎంపికైన 33 మంది హజ్ యాత్రికుల 'టీకా శిబిరం' మంగళవారం మెదక్ జిల్లా ఆసుపత్రిలో నిర్వహించారు. ఇట్టి శిబిరంలో యాత్రికులకు సంబంధించిన అన్ని రకాల అవసరమైన వైద్య పరీక్షలు చేసిన అనంతరము వారికి టీకాలు వేయించడం జరిగినది. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతా దేవి జిల్లా వ్యాక్సిన్ అధికారి మాధురి పర్యవేక్షణలో టీకా శిబిరం నిర్వహించబడినది. కార్యక్రమంలో వైద్య మరియు ఆరోగ్య శాఖ సిబ్బంది తోపాటు జిల్లా హజ్ కోఆర్డినేటర్ మహమ్మద్ ఎజాజుద్దీన్, మెదక్ జిల్లా హజ్ సొసైటీ సభ్యులు ఎండి రియాజుద్దీన్, సాబీర్, జైన్ ఉల్ అబేదీన్ స్వచ్ఛందంగా పాల్గొని హజ్ యాత్రికుల టీకా శిబిరం విజయవంతం కావడంలో తమవంతుగా సహకారం అందించారు.

వెలుగులోకి ఆదిమానవుల రాతి చిత్రాలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 31: మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామ పరిసరాల్లో అరుదైన ఆదిమానవుల రాతి చిత్రాలు వెలుగులోకి వచ్చాయి. నిజాం డెక్కన్ షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని రాళ్ల గుట్టపై ఈ చిత్రాలు గుర్తించబడ్డాయి. సుమారు 15 అడుగుల ఎత్తు, 20 అడుగుల వెడల్పు గల రాతి ఉపరితలంపై ఈ చిత్రాలు కనిపిస్తున్నాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి చెందిన పరిశోధకుడు బుర్ర. సంతోష్ ఈ రాతిచిత్రాలను గుర్తించారు. ఈ చిత్రాల్లో తాబేళ్లు, జిగ్‌జాగ్ రేఖలు, పాత్రల ఆకృతులు, గొలుసు మాదిరి నమూనాలు, చెట్లను పోలిన గీతలు, బాణాల ఆకారాలు, వృత్తాలు, త్రిశూల ఆకృతులు, తేనెపట్టు మాదిరి డిజైన్లు వంటి విభిన్న నమూనాలు కనిపిస్తున్నాయి. అన్ని చిత్రాలు ఎరుపు రంగుతో గీయబడ్డాయి. రాతిచిత్రాల నిపుణులు Dr. బండి మురళీధర్ రెడ్డి మరియు శ్రీరాంమోజు హరగోపాల్ అభిప్రాయం ప్రకారం, ఈ చిత్రాల్లో కొన్ని పెదరాతి యుగానికి చెందినవిగా, ఎక్కువ భాగం చారిత్రక యుగానికి చెందినవిగా భావిస్తున్నారు. రంగు గాఢత, గీతల శైలిని ఆధారంగా తీసుకుని ఈ నిర్ధారణకు వచ్చారు. తెలంగాణలో ఉన్న శతాధిక రాతి చిత్రాల తావుల్లో మంబోజిపల్లి స్థలం ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఆవిష్కరణతో ఆదిమానవుల జీవన విధానం, కళా రూపాలపై మరింత పరిశోధనలకు మార్గం సుగమమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

అత్యవసర వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగకరం

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 31: అత్యవసర వైద్య సేవలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగ పడుతుంది అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 156 మంది లబ్ధిదారులకు సుమారు రూ.34 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అత్యవసర వైద్య అవసరాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉందని, అవసరమైన వారికి సమయానికి ఆర్థిక సహాయం అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎర్లీ బర్డ్ స్కీంను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్

ప్రతిపక్షం, దుబ్బాక మార్చి 31: దుబ్బాక మున్సిపాలిటీలో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్ను చెల్లించే ప్రజలందరూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక మున్సిపాలిటీ కమిషనర్ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు ఆస్తి పన్ను చెల్లించే ప్రజలందరికీ వారు చెల్లించే ఆస్తి పన్నుల్లో ఐదు శాతం రాయితీ ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో 5410 గృహాల యజమానులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి
- ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 31: 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాభితా చదివి వినిపించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపి డి ఓ లు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం గ్రామ సభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు.

బస్టాండ్ ను అందుబాటులోకి తేవాలి

- ఎఫ్డీసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చి 31: నిర్మాణంలో అసంపూర్తిగా ఉన్న ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ప్రజ్ఞాపూర్ బస్టాండ్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ గజ్వేల్, ప్రజ్ఞాపూర్, తూప్రాన్ బస్టాండ్‌ల ఆధునీకరణ, నిర్మాణాల కోసం నిధులను మంజూరు చేసిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేయకుండా తాత్సారం చేస్తోందని ఆరోపించారు. పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా అవసరాలను గుర్తించి, వెంటనే నిధులు విడుదల చేసి యుద్ధప్రతిపాదికన బస్టాండ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కర్ పద్మాబాయి నర్సింగ్ రావు, స్థానిక కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటికి వత్తాసు పలుకుతున్న ప్రభుత్వం

- ప్రభుత్వ తీరుపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఫైర్

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 31: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమాలకు బహిరంగంగా వత్తాసు పలుకుతున్న ప్రభుత్వ వైఖరిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిషేధిత భూముల్లో జరుగుతున్న పొంగులేటి ఆక్రమణలు ప్రజాస్వామ్యానికి, చట్టానికి విరుద్ధమని ఆయన ఘాటుగా విమర్శించారు. ఈ అంశంపై తక్షణమే సమగ్ర నిజ నిర్ధారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వము మౌనంగా ఉండటం అనేది అక్రమాలకు మద్దతు ఇచ్చినట్టే అవుతుందని, ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేసినట్టే అవుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజల భూములు కబ్జా చేయడం సహించేది లేదని, అధికార దుర్వినియోగం చేస్తే చూస్తూ ఊరుకోమని, నిజం వెలుగులోకి రాకపోతే, న్యాయం జరిగే వరకు పోరాటం



ముమ్మరం చేస్తాం అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడటంలో ఎలాంటి రాజీ పడబోమని, అవసరమైతే ఉద్యమాలను ఉద్ధృతం చేసి బాధితులకు న్యాయం సాధించేవరకు వెనక్కి పోయేదే లేదని ఆయన హెచ్చరించారు.. ప్రభుత్వం చేసేది తక్కువ చెప్పేది ఎక్కువ అన్నట్లు వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు. ఉప కాలువలు పూర్తి చేసి సాగునీళ్లు అందేలా కృషి చేయాలని, దుబ్బాక నియోజకవర్గం లో ఉప కాలువలు నిర్మించి సాగునీళ్లు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కి మరోసారి ఆయన విజ్ఞప్తి చేశారు.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కి ఉప కాలువల నిర్మాణంతో పాటు నియోజకవర్గం లోని పలు రోడ్ల నిర్మాణాలకు, అభివృద్ధి నిధుల కోసం లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేయడం కూడా జరిగిందన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరాం సంగీత, బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గుండ వెల్లి ఎల్లా రెడ్డి, పలువురు కౌన్సిలర్ లు బి ఆర్ ఎస్ నాయకులు కొత్త కిషన్ రెడ్డి, చెక్కా పల్లి రాజు పాల్గొన్నారు.

పెళ్లయినంత మాత్రాన ఎదుటివారికి ఇష్టం లేకపోయినా ముహూర్తం పేరుతో శృంగారానికి బలవంతం చేయడం తప్పు. ఇది రేప్ కిందకే వస్తుంది. పెద్దలు కుదిర్చిన పెళ్లిలో భర్త గురించి తెలుసుకునే సమయం కూడా దొరకదు. దంపతుల మధ్య గౌరవం, ఇష్టం ఉన్నప్పుడే ఆ బంధం కలకాలం ఉంటుంది.

- సింగర్ చిన్మయి

ఎల్ డీఎఫ్ గెలవాలని మోడీ కోరిక : రాహుల్ గాంధీ

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంతో దేశ భవిష్యత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ తాకట్టు పెట్టారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ ఒప్పందం వల్ల దేశ రైతులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆక్షేపించారు. కేరళలోని కన్నూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ, బీజేపీకి లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కి మధ్య చీకటి ఒప్పందం ఉందన్నారు. ఆ రెండింటితో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ పోరాడుతోందని వెల్లడించారు. సీపీఐ (ఎం) ఏమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్ వింగ్ పార్టీ అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు బీజేపీతో జత కట్టారని విమర్శించారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలవాలని నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని రాహుల్ ఆరోపించారు. నరేంద్ర మోదీని డొనాల్డ్ ట్రంప్ ఎలాగైతే నియంత్రిస్తున్నారో అలాగే కేరళ ముఖ్యమంత్రిని ప్రధాని నియంత్రిస్తున్నారు. తన కేసు విషయంలో నరేంద్ర మోదీ చర్యలు తీసుకోవడం లేదని కేరళ సీఎంకు తెలుసు. తనను జైలులో ఉంచేందుకు కావాల్సిన తాళం చెవి మోదీ దగ్గర ఉందని కూడా కేరళ సీఎంకు తెలుసు. నరేంద్ర మోదీని కాంగ్రెస్, రాహుల్ గాంధీ విమర్శించడం మీరు చూస్తారు. కానీ, మోదీని కేరళ సీఎం విమర్శించడం మీరు అసలే చూడలేరు. అలానే కేరళ సీఎంను మోదీ విమర్శించడం కూడా చూడరు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిపై దాడి జరుగుతుందని రాహుల్ గాంధీ చెప్పారు. "నాపై 36 కేసులు ఉన్నాయి. నా ఇంటిని లాక్కున్నారు. నా లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు. ఈడీ నన్ను 55 గంటల పాటు విచారించింది. ఒకవేళ ముఖ్యమంత్రి విజయన్ నిజంగానే కాషాయ పార్టీకి ముప్పు అయితే ఆయనపై ఎన్నో ఏళ్లుగా ఉన్న అవినీతి కేసుల్లో కేంద్ర ఏజెన్సీలు ఎందుకు చర్యలు తీసుకోలేకపోయాయి. ఆయన పిల్లలను ఎందుకు విచారించలేదో నాకు చెప్పండి? ఆయనపై ఎందుకు దాడి జరగడం లేదో నాకు వివరించండి?" అని రాహుల్ గాంధీ అన్నారు.

విశ్వ వీక్షణం

కామన్ సివిల్ కోడ్.. లవ్ జీహాద్‌పై చట్టం

- అసోంలో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన బీజేపీ
- మహిళలకు రూ. 3000 హామీ

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: అసోంలో ఏప్రిల్ 9న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ ప్రకటించింది. రాజధాని గుహవటిలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో సీఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ సైకియా తదితరులు మేనిఫెస్టో విడుదల చేశారు. సంకల్ప పాత్ర పేరుతో రూపొందిన ఈ మేనిఫెస్టోలో బంగ్లాదేశీయులను రాష్ట్రం నుంచి పంపించడంతోపాటు యూసీసీ చట్టంపై కూడా ప్రజలకు హామీ ఇచ్చింది. మూడోసారి ఎన్నికైతే అసోం యాక్ట్ 1950 ప్రకారం రాష్ట్రం నుంచి బంగ్లాదేశీయులను తరిమేస్తామని సీఎం హిమంత బిశ్వ శర్మ అన్నారు. 24 గంటల్లోగా జిల్లా అధికారులతో కలిసి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చిన వారిని పంపించేస్తామని ప్రకటించారు. ఒక్క అంగుళం భూమిని కూడా అసోం నుంచి వారికి ఇవ్వబోమన్నారు. అసోంలో యూసీసీ (యునిఫాం సివిల్ కోడ్) అమలు చేయడంతో పాటు, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌ను అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. రాబేయే ఐదేళ్లలో బంగ్లాదేశీ వలసదారులైన మియాల మూలాల్ని దెబ్బతీస్తామని చెప్పారు. మేనిఫెస్టోలోని కీలక అంశాలివి. ఐదేళ్లలో అసోంను వరదల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటం. మొదటి రెండేళ్లలో వరదల నివారణ కోసం రూ.18,000 కోట్లు కేటాయింపు. యూసీసీకి సంబంధించి ఆరో షెడ్యూల్ ప్రకారం గిరిజన ప్రాంతాలను మినహాయిస్తారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక దృష్టి పెట్టడం. ఐదేళ్లలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు. ఒరునోదయ్ స్కీం కింద ప్రస్తుతం మహిళలకు అందిస్తున్న రూ.1,250ని రూ.3,000కు పెంచుతారు. అలాగే రాష్ట్రంలో ఉచిత విద్యను అందిస్తారు. తేయాకు తోటల్లో పని చేసే కార్మికులకు రోజువారీ వేతనం రూ.500కు పెంపు. రవాణా రంగానికి రూ.5 లక్షల కోట్లు కేటాయింపు. ముఖ్యమంత్రి మహిళా ఉద్యమిత స్కీం కింద మహిళలకు రూ.25,000 ఆర్థిక సాయం. వన్ డిస్ట్రిక్, వన్ ఇనిస్టిట్యూషన్ మోడల్ కింద ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్, ఒక యూనివర్సిటీ, ఒక ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేస్తారు.

కాలంతో పాటు పరుగులు తీస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో అందరికీ నిద్రపై శ్రద్ధ తగ్గుతోంది. రాత్రిపూట సరిగా నిద్రపోక పోవడంతో దాని ప్రభావం.. పనిచేసే ఉద్యోగంపై, చదువుకునే చదువులపై తీవ్రంగా కనిపిస్తుంది. మనిషిలోని జీవ గడియారం సరిగా పనిచేయాలంటే నిద్ర చాలా అవసరం. మనిషి శరీరానికి విశ్రాంతి లేకుంటే ఏ పనీ సరిగా చేయలేము. ఒకవేళ చేసినా అది సంపూర్ణ స్థితిలో ఉండటం కష్టమే.. శరీరంలోని ప్రతి అవయవ భాగం ఒకదానితో మరోటి సమన్వయం కావాలంటే నిద్ర తప్పనిసరి. ప్రతి మనిషి రోజు కనీసం సగటున ఏడు గంటలైనా సుఖంగా నిద్రపోవాలి.

నిద్రతోనే మెదడుకు పదును!

శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో నిద్ర ముఖ్యపాత్ర పోషిస్తుంది. గడియారం లేకుండా చేసే ఉద్యోగాలు, జీవితంలో ఎన్నో రకాలైన బాధ్యతలను మోసే మనం మనకు తెలియకుండానే ఎన్నో ఒత్తిడులకు గురి చేస్తుంటాయి. ఒత్తిడులను ఎదుర్కొనే క్రమంలో వ్యక్తిగతంగా చేయాల్సిన కొన్ని పనులు కూడా చేయలేనటువంటి పరిస్థితు ఏర్పడుతుంది. ఫలితంగా సహజ సిద్ధంగా చక్కటి ఆరోగ్యం లభించే పరిస్థితి కోల్పోయి రోజుల కొద్దీ ఆసుపత్రుల చుట్టూ పరుగులు పెడుతుంటాము.

మనిషికి నిద్ర చాలా అవసరం. నిద్ర కరువైతే శరీరం అనేక రోగాలకు దారి తీస్తుంది. నిద్ర శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో కీలకం. నిద్రలేమి అనేది ప్రపంచ వ్యాప్తంగా మనుషులను పీడిస్తున్న ప్రధానమైన సమస్య. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లుగా నిద్రలేమి పట్టి పీడిస్తుంది. ఎన్నో సౌకర్యాలతో పాటు ఆస్తులు, అంతస్తులు, కుటుంబ సభ్యులు, ఉద్యోగం ఉన్నప్పటికీ కూడా ప్రపంచవ్యాప్తంగా 45 శాతం మంది నిద్రాదేవి ఆదరణను నోచుకోవడం లేదని సర్వేలు తెలియజేస్తున్నాయి. సకల మనోరుగ్మతలకూ, శారీరక రుగ్మతలకూ సుఖ నిద్రయే మందు. నిద్రను ఆహ్వానించి, ఆస్వాదించినప్పుడే ఆనందంగానూ, ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంటుంది.

వయసును బట్టి నిద్ర

వయసును బట్టి నిద్రపోయే వేళలు మారినప్పటికీ కనీసం సగటున ప్రతిరోజూ ఏడు గంటలైనా నిద్రపోవాలి. నిద్ర లేమి వల్ల శరీర బరువు పెరుగుతుందనేది అక్షర సత్యం. మెదడు పనితనం సన్నగిల్లుతుంది. సగటు ఆయుర్దాయం తగ్గుతుంది. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, నిద్ర లేవడం అలవాటు చేసుకోవాలి. సెలవురోజు అంటూ నిద్రకు ఎలాంటి మినహాయింపు లేదు. ప్రతిరోజూ వ్యాయామం చేసినట్లయితే సుఖనిద్ర శరీరం కోరుకుంటుంది. పుట్టిన పిల్లలకు 18 గంటల నిద్ర, చిన్నపిల్లలకు 11 గంటల నిద్ర, టీనేజీలో ఉండేవారికి 8 గంటలు నిద్ర సుఖప్రదమైనది.

మెదడు పదును

ఆరోగ్యకరమైన జీవితానికి నిద్ర మూలస్తంభం వంటిది. శరీరానికి ఆహారం ఎంత ముఖ్యమో నిద్ర కూడా అంతే ముఖ్యం. నిద్రావస్థలోనే శరీరం రిలాక్స్ పొంది ఆ రోజులో జరిగిన చిన్న చిన్న ఇబ్బందులను తొలగించుకుంటుంది. సంపూర్ణ నిద్రలోనే మెదడు పదునెక్కుతుంది.

నిద్రలేమి ఎందుకు?

- **వయసురీత్యా సంభవించే వృద్ధాప్యం, సమయానికి భోజనం చేయకపోవడం, ఆహారంలో మసాలాలు ఎక్కువగా తీసుకోవడం, ధూమ, మద్యపానాలు సేవించడం, శరీరానికి తగినంత వ్యాయామం లేకపోవడం వల్ల నిద్రలేమి సమస్యలు వచ్చే ఆస్కారం ఉంటుంది.**
- **మెదడు సక్రమంగా పనిచేయడంలో నిద్ర కీలకపాత్ర పోషిస్తుంది. మెదడు సరిగా పనిచేస్తే మంచి ఏకాగ్రత లభిస్తుంది. తద్వారా తెలివిగా పనిచేయడంలో మెదడు సహకరిస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచేందుకు నిద్ర కూడా ఉపయోగపడుతుంది.**
- **సుఖమైన నిద్ర శరీరానికి కలిగే అలసట, శరీర నొప్పుల నుంచి ఉపశమనాన్ని ఇస్తుంది. రోజంతా కష్టపడి పనిచేసి అలసట చెందినవారికి మంచి నిద్ర వల్ల శరీరానికి, మనసుకు హాయి దొరుకుతుంది.**
- **మనిషిలో కలిగే భావోద్వేగాలను నియంత్రణ చేయాలంటే మంచి నిద్ర అవసరం. మనిషి సుఖనిద్ర వల్ల తనలో కలిగే ఆవేశాలను తన నియంత్రణలో ఉంచుకోగలుగుతాడు. ఇతరులతో చక్కటి మానవ సంబంధాలు కలిగించేందుకు కూడా నిద్ర తోడ్పడుతుంది.**
- **నిద్రలేమి కారణంగా మనిషిలో మానసిక ఒత్తిడి కలుగుతుంది. ఒత్తిడితో బాధపడే రోగులు తగినంత నిద్రపోని వారే ఉంటారని ఇప్పటికే చాలా పరిశోధనలు తేల్చాయి. చాలినంత నిద్ర పోకుంటే ఒత్తిడి, కుంగుబాటు వంటి మానసిక సమస్యలు వస్తాయి.**
- **ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాగైనా సరే సగటున ఏడు గంటలు నిద్ర అవసరం. తక్కువనిద్ర, ఎక్కువనిద్ర.. ఏదైనా సరే మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.**
- **నిద్రలేమి యువతలో కూడా ఎక్కువగా ఉంటోంది. యువత రాత్రిపూట 8-గంటలపాటు నిద్రపోవాలి. ఒకప్పుడు బెడ్‌రూమ్ అంటే విశ్రాంతికి చిహ్నంగా ఉండేది. ప్రస్తుతం పడకగదిలో కూడా లాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు అత్యధికంగా ఉపయోగిస్తున్నారు అనడంలో అతిశయోక్తి లేదు. స్మార్ట్‌ఫోన్‌లకు బానిసలుగా మారి నిద్రను తగ్గిస్తూ మానసిక రుగ్మతలు పెంచుకుంటున్నారు.**

మంచి నిద్ర కోసం..

- **రాత్రిపూట తీసుకునే ఆహారం నిద్రా సమయం కంటే రెండు గంటల ముందుగా తీసుకోవాలి. మనం పడుకునే సమయం వరకు ఆహారం సగం జీర్ణం కావాలి.**
- **నిద్ర పోవాలనే సమయానికంటే అరగంట ముందుగానే సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. ఈ సమయంలో కుటుంబ సభ్యులు, ఆత్మీయ సన్నిహితులతో గడపాలి.**
- **నిద్రకు ముందు కొంత సమయం పాటు కళ్ళు మూసుకుని ముగ్ధమనోహరమైన దృశ్యాన్ని ఊహించుకోవాలి.**
- **నిద్రలేమి సమస్య తీవ్రంగా ఉంటే దగ్గరలోని సైకాలజిస్ట్ ద్వారా కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ చికిత్స ద్వారా నిద్రలేమి సమస్యను అధిగమించవచ్చు.**
- **నిద్రలేమి సమస్యకు నిద్ర మాత్రలు పరిష్కారం కాదని, ఆలోచనావిధానంలో మార్పుతోనే పరిష్కారం సాధ్యం. సహజసిద్ధంగా లభించే నిద్రను ఆస్వాదించాలి.. చక్కటి ఆరోగ్యంతో జీవించాలి.**

టీవీకే చీఫ్ విజయ్ పై కేసు

- ఎన్నికల నియమావళి ఉల్లంఘించారంటూ ఫిర్యాదు

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: మిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ చీఫ్ విజయ్‌కు ఎన్నికల సంఘం షాకిచ్చింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు విజయ్‌పై ఈసీ కేసు నమోదు చేసింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించినందుకు పెరావల్లూర్ పోలీస్ స్టేషన్‌లో విజయ్‌పై కేసు నమోదైంది.

ఒక పబ్లిక్ మీటింగ్ సందర్భంగా రూల్స్ అతిక్రమించినందుకుగాను, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్‌పై కేసు రిజిష్టర్ చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడులో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రమంతా ఎన్నికల వేడి మొదలైంది. ఈ నేపథ్యంలో టీవీకే చీఫ్ విజయ్ రాష్ట్రమంతా పర్యటిస్తున్నారు. ఇటీవల ఒక బహిరంగ సభ సందర్భంగా నిబంధనల్ని ఉల్లంఘించినట్లు ఈసీ ఆరోపించింది. అధికారుల అనుమతి లేకుండా సభలో ఏకంగా 30 లౌడ్ స్పీకర్లు ఉపయోగించాడని, అలాగే 5,000 మందికి మించి ప్రజలు సభకు హాజరయ్యారని, దీనివల్ల ప్రజలకు అసౌకర్యం కలిగించారని ఆరోపిస్తూ ఈసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, రోడ్లు బ్లాక్ చేయడం, అంబులెన్స్‌కు దారి ఇవ్వకపోవడం, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాల్ని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో విజయ్‌పై ఐదు సెక్షన్ల కింద కేసు నమోదైంది. విజయ్‌తోపాటు సభకు హాజరైన దాదాపు 5,000 మంది పార్టీ కార్యకర్తల్ని కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు సమాచారం. దీనిపై తదుపరి చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

భారీ ఉగ్రకుట్ర భగ్నం

- ఢిల్లీలో లష్కర్ ఏ తొయిబా ఉగ్రవాది అరెస్టు

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: దేశంలో భారీ ఉగ్రకుట్ర బయటపడింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాకు సహకరిస్తున్న షబ్బీర్ అహ్మద్ అనే ఉగ్రవాదిని ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఉగ్రదాడులకు సంబంధించి కీలక సమాచారాన్ని సేకరించారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో భారీ పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని వాణిజ్య ప్రాంతాలు, హిందూ దేవాలయాలే టార్గెట్‌గా ఎంచుకున్నట్లు వెల్లడైంది.

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బంగ్లాదేశ్ కేంద్రంగా పని చేసే ఉగ్రసంస్థలతో, అలాగే పాక్ ఉగ్రవాద సంస్థలతోనూ ఢిల్లీకి చెందిన షబ్బీర్ అహ్మద్ సంబంధాలు కలిగి ఉన్నాడు. దేశంలోని కీలక ప్రదేశాలకు సంబంధించిన సమాచారాన్ని అతడు లష్కరే తొయిబా వంటి సంస్థలకు చేరవేశాడు. ఢిల్లీలోని ప్రధాన కేంద్రాల్ని వారు లక్ష్యంగా ఎంచుకుని, అనేక ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని హిందూ ఆధ్యాత్మిక కేంద్రాలైన కల్కాజి టెంపుల్, చాతర్‌పూర్ టెంపుల్, లోటస్ టెంపుల్‌లతోపాటు ప్రధాన వాణిజ్య కేంద్రాలైన కొన్నాట్ ప్లేస్, పహర్‌గంజ్ వంటి కమర్షియల్ హబ్స్‌ను ఎంచుకున్నారు. షబ్బీర్ అహ్మద్ వాటిని మొత్తం పరిశీలించి, అక్కడి వివరాల్ని వీడియోలుగా చిత్రీకరించి, వాటిని పాక్ ఉగ్రసంస్థలకు చేరవేశాడు. షబ్బీర్ ఒంటరిగా తిరుగుతూ ఆ ప్రదేశాల వివరాల్ని సేకరించాడు. అతడు బంగ్లాదేశ్, పాక్ ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐ వంటి పాక్ ఇంటెలిజెన్స్ సంస్థలతో కూడా కలిసి పని చేస్తున్నాడు. బంగ్లాదేశ్‌లో ఒక కొత్త తీవ్రవాద సంస్థను స్థాపించాలనే లక్ష్యంలో భాగంగా షాబిద్, మిగతా ఉగ్రవాదులు కలిసి పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ చుట్టు పక్కల ప్రాంతాల్లో సభ్యుల్ని చేర్చుకోవడం, ఉగ్రవాదంపై ప్రోత్సహించడం వంటి కార్యకలాపాలు లక్ష్యంగా వీరు పని చేస్తున్నారు. భారత నిఘా సంస్థల నుంచి తప్పించుకునేందుకు షబ్బీర్.. టెలిగ్రాం వంటి యాప్స్ వాడేవాడు. ఇటీవల ఇలాగే జమ్మూ కాశ్మీర్‌లో ఇలాగే టీఆర్ఎఫ్ (ద రెసిస్టెన్స్ ఫ్రంట్) అనే ఉగ్ర సంస్థ పుట్టుకొచ్చిన సంగతి తెలిసిందే. ఢిల్లీ పోలీసులు సరైన సమయంలో షబ్బీర్ అనే ఉగ్రవాదిని గుర్తించడంతో భారీ కుట్ర భగ్నమైంది.

అక్షరాలే ఆత్మీయులు..

ఒక తరంనుండి మరొక తరానికి జ్ఞాన ప్రసారం జరగడానికి అతి ముఖ్యమైన సాధనాలు పుస్తకాలు. సిసిరో అనే మహా పండితుడి అభిప్రాయం ప్రకారం 'పుస్తకాలు లేని గది ఆత్మలేని శరీరం వంటిది'. దీనిని బట్టి పుస్తకాలకు ఎంత ప్రాముఖ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని పుస్తకాలు చదవటం ద్వారా కొంతమంది జీవితాలలో అనూహ్య మార్పులు సంభవించాయి. ఫలితంగా వారు ఎంతో ఉన్నత స్థానానికి చేరుకున్నారు. వివిధ వ్యక్తుల ఆలోచనలను, భావాలను తెలుసుకొనుటకు పుస్తకాలు మనకు ఎంతగానో తోడ్పడతాయి. వివేకమును విజ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు పుస్తకాలు ఉపయోగపడతాయి.

శరీరానికి వ్యాయామం ఎలాగో మెదడుకు పుస్తక అధ్యయనం అలాంటిది. పుస్తక పఠనంతో మేధస్సు సక్రమంగా పనిచేస్తుంది. అనవసరమైన ఆలోచనలవైపు దృష్టి మరలకుండా, మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండవచ్చు. పుస్తకాన్ని ఆస్వాదిస్తూ చదివితే అది మన మనసుకు ఆనందాన్ని, తృప్తిని కలిగిస్తుంది. మంచి పుస్తకం మనం బాధలో ఉన్నప్పుడు అమ్మలా లాలిస్తుంది. కష్టాల్లో వున్నపుడు నాన్నలా ఆదరించి ధైర్యం చెపుతుంది. అవసరమైనపుడు గురువులా హితబోధ చేస్తుంది. ఆపదలో వున్నపుడు స్నేహితునిలా అక్కున చేర్చుకొని ఓదారుస్తుంది.

ఎక్కువ సంఖ్యలో చదువుకున్నవారు వున్న దేశాలు అభివృద్ధి పథంలో ముందున్నాయి. చాలామంది పుస్తకాలను చదవడం ద్వారా అనేక విషయాలు తెలుసుకొని జీవితంలో గౌరవప్రదంగా బతుకగలుగుతున్నారు. మనకు ఎదురవుతున్న అనేక సమస్యలు గతంలో అనేక మందికి కలిగిన అనుభవాలే.. అలాంటి అనుభవాలతో చాలా పుస్తకాలే వచ్చాయి. అవి చదివితే ఎందరో జీవిత అనుభవాలను మనం కొన్ని గంటల్లోనే తెలుసుకొని మన జీవితాలను చక్కదిద్దుకోవచ్చు. స్నేహితుల సాంగత్యం వలన మంచి చెడులను గ్రహించి ఏ విధంగా ఆనందంగా ఉండగలుగుతామో మంచి పుస్తకాల సహవాసం వలన కూడా అంతే సంతోషంగా ఉండగలుగుతాము. అందుకే పుస్తకాలే మనకు మంచి నేస్తాలని చెప్పవచ్చు. ఒక మంచి పుస్తకం స్నేహితులలోకెల్లా ఉత్తమమైనది. అలాంటి పుస్తక నిలయాలైన గ్రంథాలయాలను అభినవ దేవాలయాలుగా పెద్దలు అభివర్ణించారు. అందుకని విద్యార్థులు మంచి పుస్తకాలు చదవడానికి గ్రంథాలయానికి వెళ్లడం అలవాటు చేసుకోవాలి. విద్యార్థులు తమ దగ్గర వున్న పొదుపు డబ్బుతో చిన్నప్పటి నుండే మంచి పుస్తకాలు కొనుక్కొని చదివే అలవాటును పెద్దలు ప్రోత్సహించాలి.



ప్రాచీనకాలంనుండి కూడా మన దేశంలో పుస్తకాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువగా భారతీయులే పుస్తక పఠనానికే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని సర్వేలు చెపుతున్నాయి. ఒక సర్వే ప్రకారం వారానికి భారతీయులు సుమారు 11 గంటల సమయాన్ని పుస్తక పఠనానికి వెచ్చిస్తున్నారు. వేదాలు, పురాణేతిహాసాలు, ఆధ్యాత్మికం, సాహిత్యం, శాస్త్రం, ఆరోగ్యం, రాజకీయం, చరిత్ర మొదలకు అంశాలతో పాటు కథలు, కవిత్వం, నాటకం, వ్యాసం, నవల, పద్యం, గద్యం మొదలగు భిన్న విషయాలతో పుస్తకాలు మనకు విజ్ఞాన భాండాగారంగా వెలుగొందుతున్నాయి. భారత రాజ్యాంగపిత అయిన అంబేద్కర్ తన సమయాన్ని ఎక్కువగా పుస్తక పఠనానికే కేటాయించేవారు. తన సంపాదనలో ఎక్కువ భాగం పుస్తకాల కొనుగోలుకే ఖర్చుచేసేవారు. ప్రపంచంలోని చాలామంది మేధావులు కూడా పుస్తక పఠనమే అభిరుచిగా కలిగివున్నారు. ఒకప్పుడు పుస్తకాన్ని హస్త భూషణం అనేవారు. కానీ నేటి కాలంలో దాని స్థానాన్ని సెల్‌ఫోన్ ఆక్రమించింది. నేడు ఇదే హస్త భూషణంగా మారింది. సాంకేతిక పరిజ్ఞానం వలన పుస్తకం కూడా తన రూపాన్ని మార్చుకొంటున్నది. ఇపుడు ఏ పుస్తకం కావాలన్నా ఇ-బుక్స్ రూపంలో ఇంటర్నెట్‌లో లభ్యం అవుతున్నాయి. కాకపోతే ఇందులో చదవడం కొంతమేరకు ఇబ్బందికరంగా ఉంటుంది. సినిమా, టెలివిజన్, మొబైల్, ఇంటర్నెట్ మొదలైన వాటివలన విద్యార్థులలో, యువతలో పుస్తక పఠనం రాను రానూ తగ్గిపోతోంది. ఇప్పటికైనా యువతరం పుస్తకాలను తమ జీవితానికి చుక్కానిగా మార్చుకునే ప్రయత్నం చేయాలి. పుస్తకాలకు వున్న ప్రాధాన్యత దృష్ట్యా కందుకూరి వీరేశలింగం పంతులుగారు 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కోగానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో.. ఆ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అన్నారు. ఆయన చెప్పిన మాటలు నేటికీ అక్షర సత్యాలే...

సినిమా

రామాయణ టీజర్‌కు సెన్సార్ కంప్లీట్

బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణ'. దాదాపు రూ.3000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్ష కుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ఈ సినిమా టీజర్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) క్లియరెన్స్ ఇచ్చింది. ఈ చిత్రం నుంచి 'రామ' పేరుతో రాబోతున్న ఈ టీజర్ విడుదలకు ముందు సెన్సార్ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఏప్రిల్ 2న టీజర్ విడుదల చేయడానికి మార్గం సుగమమైంది. దీనితో పాటు ఈ టీజర్ నిడివికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం, 'రామ' టీజర్ రన్‌టైమ్ 2 నిమిషాల 38 సెకన్లుగా ఉంది. ఈ టీజర్‌కు సెన్సార్ బోర్డు యూనివర్సల్('U') రేటింగ్ ఇచ్చింది, దీంతో ఈ టీజర్‌ను అన్ని వయసుల వారు థియేటర్‌లలో వీక్షించవచ్చు.

'కథనార్' ట్రైలర్ విడుదల

గోకులం మూవీస్ బ్యానర్ మీద గోకులం గోపాలన్ నిర్మాతగా రొజిన్ థామస్ తెర కెక్కించిన చిత్రం 'కథనార్'. ఈ సినిమాలో జయసూర్య, అనుష్క శెట్టి, ప్రభుదేవా, సనూప్ సాన్ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. 'విజ్ఞానం యొక్క రూపం మూలం ఎలా ఉన్నా కూడా.. కాంతూర్ శాలయలో దాన్ని ఆహ్వానిస్తారు.. ఇంద్రజాలాన్ని నేను నమ్మను.. అవగాహనతో రహస్య మార్గాలలో వాళ్లు దాన్ని పరిశోధిస్తున్నారు.. ఎవరి ఊహకి అందని.. అందరూ ఆశ్చర్యంతో చూసే ఒక మాయా జాలం.. మన ఆత్మతో కలిసి మన జ్ఞాపకాలతో ఐక్యం కాబోయే ఒక సంఘటన.. చేర మహారాజుకి కుంచమున్ తరుపున శుభాకాంక్షలు'.. 'చూసినది విన్నది ఏదీ రాదు.. వచ్చేది ఒక్కటే.. ఆపత్కాలంలో వచ్చే మహా మనిషి అగ్ని ఒక్కటే'.. 'కరం కలిస్తే ఆప్యాయిత.. కరం వెడిస్తే నాశనమే బలం'.. 'ఒక శరీరాన్ని అదుపు చేసే ఎక్కువ శక్తిని మీరు నియంత్రించగలిగారు.. ఎలాగా?'.. 'మేం చెప్పేది నమ్మండి. వేనాడు ఆపదలో ఉంది'.. 'మాయ.. ప్రపంచమే మాయ' అంటూ సాగిన డైలాగ్స్‌తో ట్రైలర్ అద్భుతంగా ఉంది. ఇక ఈ ట్రైలర్‌లో జయసూర్య, అనుష్క శెట్టి, ప్రభుదేవా, సనూప్ సాన్, శాండీ, దేవిక, నితీష్ భరద్వాజ్, వినీత్, హరీష్ ఉత్తమన్, శ్రీకాంత్ మురళి, కుల్‌ప్రీత్ యాదవ్‌లను చూపించిన తీరు, ఒక్కో పాత్ర, వారి లుక్‌ను రివీల్ చేసిన తీరు అద్భుతంగా ఉంది. ఇక ఇందులోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్, వీఎఫ్ఎక్స్ వర్క్ అద్భుతంగా ఉందనిపిస్తోంది. ఈ ట్రైలర్‌ను చూస్తుంటే ఇండియన్ సినీ లవర్స్‌కి నెవ్వర్ బిఫోర్ అనిపించేలా సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించబోతోన్నట్టుగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి ఆర్ రామానంద్, రోజిన్ థామస్ రైటర్స్‌గా పని చేశారు. ఈ సినిమాకి నీల్ డి కున్హా కెమెరామెన్‌గా, రాహుల్ సుబ్రహ్మణ్యన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా, కృష్ణమూర్తి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ఇతర అప్డేట్ లను ప్రకటించనున్నారు.

వంశీ పైడిపల్లి, సల్మాన్‌ఖాన్ సినిమాలో నయనతార

ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో మరో భారీ క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి కథానాయికగా పరిచయం చేశారు మేకర్స్. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో కథానాయికగా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దిల్ రాజు నిర్మాణ సంస్థకు ఇది 63వ చిత్రం కావడం విశేషం. ఈ అప్‌డేట్‌ను వెల్లడిస్తూ.. SVC63 ప్రాజెక్ట్‌లోకి ది క్వీన్ అడుగుపెట్టింది.. ఎంతో ప్రత్యేకంగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లోకి నయనతారను ఆహ్వానించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చిత్ర బృందం రాసుకొచ్చింది.

పంజాబ్‌ను గెలిపించిన కూపర్

పోరాడి ఓడిన గుజరాత్..!

ఐపీఎల్‌లో వరుసగా నాలుగో మ్యాచ్‌లో ఛేజింగ్ జట్టే విజేతగా నిలిచింది. ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ అదిరే బోణీ కొట్టింది. బౌలర్ల విజృంభణతో గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసిన పంజాబ్‌ను కూపర్ కొన్నొ లీ(74 నాటౌట్) ఒంటిచేత్తో గెలిపించాడు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (37) మెరుపులతో అలవోకగా లక్ష్యాన్ని అందుకునేలా కనిపించినా.. ఇంప్యాక్ట్ ప్లేయర్ ప్రసిధ్ కృష్ణ(3 29) వరుస వికెట్లతో భయపెట్టాడు. కానీ, చివరిదాకా నిలబడిన కూపర్.. గ్జావియర్ బార్ట్‌లెట్ (11 నాటౌట్)తో కలిసి జట్టును గెలిపించాడు. పద్దెనిమిదో సీజన్ రన్నరప్ పంజాబ్ కింగ్స్ విజయంతో పంతొమ్మిదో సీజన్‌ను మొదలెట్టింది. ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్‌పై వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా కూపర్ కొన్నొల్లి(74 నాటౌట్) అర్ధశతకంతో జట్టును గెలిపించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా చివరిదాకా నిలబడిన కూపర్ పంజాబ్‌ను విజయ తీరాలకు చేర్చాడు. ముల్లన్‌పూర్‌లో గుజరాత్‌ను 162కే కట్టడి చేసిన పంజాబ్ కింగ్స్‌కు కగిసో రబడ ఆదిలోనే షాకిచ్చాడు. డేంజరస్ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(7) అశోక్ శర్మ క్యాచ్ అందుకోగా పెవిలియన్ చేరాడు. 7 పరుగులకే వికెట్ పడిన వేళ కూపర్ కొన్నొల్లి() జతగా మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(37) లు దూకుడుగా ఆడాడు. రెండో వికెట్‌కు76 రన్స్ జోడించిన ఈ జంటను రషీద్ ఖాన్ విడదీశాడు. ప్రభ్‌సిమ్రన్ ఔటయ్యాక వచ్చిన శ్రేయాస్ అయ్యర్(18), నేహల్ వధేరా(3)లు విఫలమయ్యారు. అప్పటికీ పంజాబ్ విజయానికి 42 బంతుల్లో యాభై రన్స్ అవసరమవ్వగా కొన్నొల్లి, శశాంక్ సింగ్()లు జట్టును గెలిపించే బాధ్యత తీసుకున్నారు. కానీ, ఇంపాక్ట్ ప్లేయర్ ప్రసిధ్ కృష్ణ(329) తెలివైన బౌలింగ్‌తో వరుస బంతుల్లో శశాంక్, మార్కస్ స్టోయినిస్(0)ను ఔట్ చేయడంతో గుజరాత్ రేసులోకి వచ్చింది. రబడ ఓవర్లో కొన్నొల్లి రెండు ఫోర్లు బాదగా.. ప్రసిధ్ బౌలింగ్‌లో యాన్సెన్ సిక్సర్‌తో మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పాడు. ప్రసిధ్ విసిరిన షార్ట్ పిచ్ బంతిని గ్జావియర్ బార్ట్‌లెట్ (11 నాటౌట్) స్టాండ్స్‌లోకి గుజరాత్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి ఓవర్లో 2 పరగులు అవసరమవ్వగా.. బౌండరీతో పంజాబ్‌కు 3 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు కూపర్. గిల్, బట్లర్ మెరిసినా..

గుజరాత్ టైటాన్స్ శుభారంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఓపెనర్లు సాయి సుదర్శన్(13), శుభ్‌మన్ గిల్(39) లు రాణించినా.. సొంత మైదానంలో పంజాబ్ కింగ్స్ బౌలర్ల ధాటికి గుజరాత్ మిడిలార్డర్ తేలిపోయింది. సాయిని ఔట్ చేసిన యాన్సెన్ తొలి బ్రేకివ్వగా.. జోస్ బట్లర్(38)తో కలిసి గిల్ ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, చాహల్ ఓవర్లో అతడు కొన్నొల్లి చేతికి చిక్కడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం గ్లెన్ ఫిలిప్స్(25) మెరుపు బ్యాటింగ్‌తో అలరించి స్కోర్‌బోర్డును ఉరికించాడు. అయితే.. విజయ్‌కుమార్ ఓవర్లో అతడు అర్ష్‌దీప్ చేతికి చిక్కగా.. కాసేపటికే చాహల్ బౌలింగ్‌లో సిక్సర్‌కు యత్నించిన బట్లర్ బౌండరీ లైన్ వద్ద బార్ట్‌లెట్ పైకెగిరి క్యాచ్ అందుకోవడంతో వెనుదిరిగాడు. ఆ తర్వాత పంజాబ్ బౌలర్లు మరింత కట్టుదిట్టంగా బంతులు సంధించగా వాసింగ్టన్ సుందర్(18), షారుక్ ఖాన్(4), రాహుల్ తెవాటియా (11నాటౌట్)లు బౌండరీలు కొట్టేందుకు ఇబ్బంది పడ్డారు. చివరి ఓవర్లో అర్ష్‌దీప్ వైడ్స్ వేయడంతో గుజరాత్ 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేయగలిగింది.



కూపర్ వల్లే గెలిచాం: శ్రేయస్ అయ్యర్

కూపర్ కానల్లీ అసాధారణ బ్యాటింగ్‌తోనే ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించామని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తెలిపాడు. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు కూపర్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని కొనియాడాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా ముల్లాన్‌పూర్ వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 3 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై గట్టెక్కింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శ్రేయస్ అయ్యర్.. అజేయ హాఫ్ సెంచరీతో పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించిన కూపర్ కానల్లీపై ప్రశంసల జల్లు కురిపించాడు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ తనను ఆకట్టుకుందని, ముఖ్యంగా తన అటాకింగ్ ఫీల్డ్ సెటప్ చూసి షాకయ్యానని తెలిపాడు. 'నా చేతి గాయం బాగానే ఉంది. ఈ గాయానికి దిష్టి తగలకూడదని కోరుకుంటున్నా. కూపర్ కానల్లీ అద్భుతంగా ఆడాడు. ముఖ్యంగా రషీద్ ఖాన్ బౌలింగ్‌లో అతను ఆడిన షాట్లు అమోఘం. డ్రెస్సింగ్ రూమ్ లోపల నా చేతి గాయానికి ఐస్ పెట్టుకునేలోపే.. మేం వరుసగా వికెట్లు కోల్పోయాం. ఐపీఎల్‌లో ఇలా జరగడం సహజమే. ఇలాంటి పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండాలి. కూపర్ అదే చేశాడు. చాలా ప్రశాంతంగా తన ఆటను తాను ఆడాడు. ఈ మ్యాచ్ మూడో ఓవర్ తర్వాతే వికెట్ స్లోగా ఉందని మాకు అర్థమైంది. అర్ష్‌దీప్ సింగ్ వచ్చి బంతి కాస్త ఆగి వస్తోందని చెప్పాడు. అందుకే మేం బంతిని వీలైనంత త్వరగా పాతబడేలా చేయడానికి ప్రయత్నించాం. విజయ్‌కుమార్ వైశాక్ గత సీజన్ ఫామ్‌ను ఇక్కడా కొనసాగిస్తున్నాడు. అతను బిగ్ మ్యాచ్ ప్లేయర్. నా బ్యాటింగ్ సమయంలో షార్ట్ లెగ్ ఫీల్డర్‌ను చూసి ఆశ్చర్యపోయాను. నేను ఇంతకుముందు ఎప్పుడూ ఇలా షార్ట్ లెగ్ ఫీల్డర్‌ను పెట్టడం చూడలేదు. ఈ విషయాన్ని శుభ్‌మన్ గిల్‌తో కూడా చెప్పాను. కెప్టెన్లు ఇలా అటాకింగ్ ఫీల్డింగ్ సెట్ చేయడం బాగుంది.'అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.

వర్షం వల్లే పంజాబ్ గెలిచింది: గిల్

లోయరార్డర్ బ్యాటర్ల స్లో బ్యాటింగ్ తమ విజయవకాశాలను దెబ్బతీసిందని గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఆఖరి ఐదు ఓవర్లలో వేగంగా పరుగులు చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 3 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో గుజరాత్ ఓడినా.. తమ పోరాట పటిమతో ఆకట్టుకుంది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. 175180 పరుగులు చేసి ఉంటే విజయం దక్కేదని అభిప్రాయపడ్డాడు. పిచ్ స్లోగా ఉండటంతో చివరి ఓవర్లలో బ్యాటింగ్ చేయడం కష్టమైందన్నాడు. వర్షం కారణంగా పంజాబ్ కింగ్స్‌కు బ్యాటింగ్ సులువైందని తెలిపాడు. చిరు జల్లులతో బంతి తడిచి బ్యాట్ పైకి ముద్దుగా వచ్చిందన్నాడు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200